
ప్రజాశక్తి

బుధవారం 13 ఆగస్టు 2025 | 8 పేజీలు



తిరుపతి



చిత్తూరు



మెష్, తలుపుల్లేని కిటికీలు

ఆరుబయటే స్నానం, బహిర్భూమి

వాచ్‌మెన్నే..వంటమనిషి..!

పల్లం ఎస్సీ బాలుర వసతి గృహ దుస్థితి



మెష్ లేకుండా ఊడిన తలుపులు

ప్రజాశక్తి - ఏర్పేడు

నిరుపేద విద్యార్థులకు ఆశ్రయం కల్పిస్తూ మిగతా వారితో చదువులో పోటీ పడాలనే లక్ష్యంతో సంక్షేమ వసతి గహాలను ఏర్పాటు చేశారు. ఉన్నత ఆశయంతో వెలసిన సంక్షేమ వసతి గహాలు ప్రస్తుతం నరక కూపాలుగా మారుతున్నాయి. విద్యార్థులు ఎన్ని ఇబ్బందులు పడుతున్నా అధికారుల్లో మాత్రం చలనం లేదు. ప్రభుత్వాలు సంక్షేమ వసతి గహాలకు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నామని చెబుతుంటాయి. కానీ క్షేత్ర స్థాయిలో కనీస సౌకర్యాలు కూడా కానరాని పరిస్థితి.

ఏర్పేడు మండలంలోని పల్లాం ఎస్సీ బాలుర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గహంలో 120 మంది వెనకబడిన తరగతుల విద్యార్థులు ఉన్నారు. అయితే ప్రభుత్వాలు మారినా సమస్యలు వీరిని వెంటాడుతున్నాయి. సురక్షిత ఆహారము, వసతి కల్పనలో నాణ్యత లేదని విద్యార్థులకు అందాల్సిన మెనూ గాడి తప్పిందని, ఉడికి ఉడకని అన్నం, నీళ్ల సాంబారు, కొందరికే గుడ్లు, తక్కువ పరిమాణంలో చికెన్ అందిస్తున్నారనీ విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. నెలకొకసారి హాస్టల్లో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి.అది ఇక్కడ పాటించట్లేదని చెబుతున్నారు. సంక్షేమశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని పిల్లల భవిష్యత్తుకు మౌలిక వసతులు కల్పించి వారి ఉన్నత భవిష్యత్తుకు సహకరించాలని పేద విద్యార్థుల తల్లిదండ్రులు కోరుచున్నారు.

వంట మనిషిగా వాచ్ మెన్.. విద్యార్థులే కామటిగా

పల్లం ఎస్సీ బాలుర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గహంలో గత కొన్నేళ్లగా పనిచేస్తున్న వంట మనిషి మానేయడంతో అప్పటి నుండి వంట మనిషి, కామటి లేక మరొకరిని నియమించక వాచ్మెన్ గా పనిచేస్తున్న వ్యక్తే వంట మనిషిగా మారాడు.విద్యార్థులే వడ్డించుకుని తినాల్సిన పరిస్థితి. అనుభవములేని వాచ్మెన్ 120 మంది విద్యార్థులకు ఏ విధంగా నాణ్యతను పాటించి వండగలరని పిల్లల తల్లిదండ్రులు

2లో



తిరుపతిలో...

2లో

వెయ్యి అడుగుల జాతీయ జండాతో 'తిరంగా'ర్యాలీ

నులిపురుగుల నివారణకు చర్యలు : కలెక్టర్



మాత్రలు పంపిణీ చేస్తూ..

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా తిరుపతి అర్బన్ కొర్లగుంటలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్ విద్యార్థిని విద్యార్థులకు ఆల్ బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1 నుండి 19 సంవత్సరాల వయసు కలిగిన 4,97, 511 మంది విద్యార్థులకు ఈ మాత్రలు ఇస్తున్నామన్నారు. విద్యార్థుల్లో రక్తహీనతను తగ్గించి ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. చిన్నారుల్లో నులిపురుగుల వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. గైర్హాజరైన వారికి ఆగస్టు 20న మాప్ ఆఫ్ డే రోజున మాత్రలు ఇస్తారన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్ మాట్లాడుతూ ఏడాదినుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు, స్కూలు టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. డి ఇ ఓ కుమార్, ప్రోగ్రాం స్టేట్ నోడల్ ఆఫీసర్స్ డాక్టర్ శ్రీనివాస వర్మ, డాక్టర్ సౌజన్య లక్ష్మి, డిపిఎమ్ఓ డాక్టర్ శ్రీనివాసరావ్, ఆర్బిఎస్కె ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రెడ్డి ప్రసాద్, యుపి హెచ్సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సింధు పాల్గొన్నారు.

అదనపు రేషన్ బియ్యం విడుదల

సిపిఎం పోరాట ఫలితం

2లో

దైవదర్శనానికి వెళుతూ..

నలుగురు దుర్మరణం

3లో

వెంకటగిరి వైసిపిలో 'రాజావారు'..?

రాంకుమార్‌రెడ్డికి జగన్ బుజ్జగింపు



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కూటమి ప్రభుత్వాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు వ్యూహాత్మకంగా జగన్ రాజకీయ అస్త్రాన్ని ఉపయోగిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జిలను, జిల్లా పార్టీ కన్వీనర్లను బలోపేతం చేసేలా నిర్ణయాలు చేస్తున్నారు. డబ్బు, జనబలం ఉన్న వారిని ఎంపిక చేయడంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. తిరుపతి జిల్లాలో వెంకటగిరి నియోజకవర్గం నుంచే ఈ మార్పులు మొదలు పెట్టారు. వెంకటగిరి నియోజకవర్గంలో ప్రస్తుతం ఇన్‌ఛార్జిగా ఉన్న నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి పెద్దకుమారుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డిని ఇన్‌ఛార్జిగా పక్కనపెట్టి వెంకటగిరి రాజావారిని రంగంలోకి తీసుకురానున్నట్లు తెలుస్తోంది. నెల్లూరు రూరల్ నుంచి పోటీచేసి వైఎస్ఆర్ హయాంలో మంత్రిగా చేసిన అనీల్‌కుమార్ యాదవ్ వెంకటగిరి కావాలని కోరడంతో రెండో అవకాశంగా అతనిని చూస్తున్నట్లు సమాచారం.

2019 ఎన్నికల్లో ఆనం రాంనారాయణరెడ్డి వెంకటగిరి నియోజకవర్గంలో వైసిపి నుంచి గెలుపొందారు. అయితే అప్పటి ఎంఎల్‌సి ఎన్నికల్లో పంచుమర్తి అనురాధకు ఓటేశారన్న అభియోగంతో ఆనం రాంనారాయణరెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి పెద్ద కుమారుడు కోట, వాకాడులో విద్యాసంస్థల్లో బిజీగా ఉన్న ఆయన్ను వైసిపి అధికారంలో ఉన్నపుడు నామినేటెడ్ పదవి ఇచ్చి వెంకటగిరి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు. 2024 ఎన్నికల్లో టిడిపి

2లో

వార్త తరువాయి..

వాచ్‌మెన్నే..వంటమనిషి..!

ఆరోపిస్తున్నారు.

దోమల మోత.. నిద్రలేని రాత్రులు : ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో ఊరు వెలుపల ఉన్న ఈ హాస్టల్ పరిసర ప్రాంతాల్లో దోమలకు ఆవాసాలుగా ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు, నీటి గుంటలు ఉండటం.మరమ్మత్తులకు గురైన కిటికీలు, మెష్ లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రుల సమయంలో విద్యార్థులకు నిద్ర కరువైంది.

ఆరుబయటే స్నానం : స్నానపు గదులు ఉన్నప్పటికీ అసౌకర్యంగా పాచిపట్టి ఉన్నాయి. దీంతో వెలుపల ఉన్న ఒకే కుళాయి దగ్గర బట్టలు ఉతకడం, అక్కడే స్నానాలు చేయడం గమనార్హం. అప్పుడప్పుడు టాయిలెట్‌కూ బహిరంగంగానే వెళుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.

భద్రత కరువు: ఈ వసతి గృహానికి సమీపంలో పల్లాం చెరువు, పెద్ద ఎత్తున జెసిబి గుంతలు దర్శనమిస్తున్నాయి. ఊరికి వెలుపల హాస్టల్ ఉండడంతో పరిసర ప్రాంతాల్లో ముళ్లపొదలు, పిచ్చి మొక్కలతో నిండి విష సర్పాలు, తేళ్లు లోపలికి వచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.ఈ సంక్షేమ హాస్టల్ కి ప్రహరీ గోడ లేకపోవడంతో పశువులూ సంచరిస్తుంటాయి.అసలే బెడ్స్ లేక నేల మీద నిద్రిస్తున్న పేద విద్యార్థులకు భద్రత దష్ట్యా హాస్టల్ చుట్టూ ప్రహరి నిర్మాణం ఎంతో అవసరమని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు

వెంకటగిరి వైసిపిలో 'రాజావారు'..?

అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణతో పోటీచేసి ఓటమి పాలయ్యారు. నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డికి బాలాయపల్లి, కోటలో తప్ప మిగిలిన మండలాల్లో పట్టు లేకపోవడంతో ఓటమి పాలయ్యారని సమీక్షలో తేలింది. రాజావారు కుటుంబం నుంచి ఎవరైనా పోటీచేస్తే గతంలో వారి ప్రాబల్యంతో గెలుపొందవచ్చని ఆ దిశగా అధినేత జగన్మోహన్‌రెడ్డి యోచన చేస్తున్నట్లు సమాచారం. ఈనెల 20పైన తాడేపల్లిలో జరిగే నియోజకవర్గ ఇన్‌ఛార్జిల సమావేశంలో అధికారికంగా నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. అన్ని నియోజకవర్గాల్లోనూ వరుసగా సర్వే నిర్వహించి, కార్యకర్తల అభీష్టం మేరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జిలను మార్పు చేసే అవకాశం ఉంది. రానున్న పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ మార్పులు ఫలితాన్ని ఇస్తే ఇన్‌ఛార్జిలుగా వారినే కొనసాగించే అవకాశం ఉంది.



'అదానీ స్మార్ట్ విసినకర్రలు' ఇవ్వండి : సిఐటియు

ప్రజాశక్తి- నాయుడుపేట

అదానీ స్మార్ట్ మీటర్లు కరెంట్ వాడితే గిర్రున రీడింగ్ తిరుగుతుందని, కరెంట్ వాడకుండా ఉండేందుకు స్మార్ట్ విసినకర్రలు ఇవ్వాలి' అని సిఐటియు నేతలు శివకవి ముకుంద ఎద్దేవా చేశారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రజలపై పెనుభారం మోపే స్మార్ట్ మీటర్లను బిగించరాదని అన్నారు. ముందస్తుగా కరెంట్ కొనుగోలు చేసుకోవాలని, పేదలకు ముందస్తు బ్యాలెన్స్ ఉంటుందా? అని ప్రశ్నించారు. బిల్లు కట్టకపోతే వెంటనే కరెంట్ కట్ చేస్తారన్నారు. నెల్లూరు పర్యటనలో నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నపుడు స్మార్టు మీటర్లను పగలగొట్టమని చెప్పారని గుర్తు చేశారు. సిఐటియు నాయకులు ఎస్‌కె అబ్దుల్లా మాట్లాడుతూ పరిశ్రమల్లో ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఇస్తున్న అరకొర వేతనాలు ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరుకులకు సరిపోవడం లేదన్నారు. ఇది చాలదన్నట్లుగా స్మార్ట్ మీటర్ల పేరుతో అదనపు భారం మోపితే ఎక్కడినుంచి తెచ్చి కట్టాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె కాలేషా, వెంకటయ్య, శ్రీనివాసులు, రామచంద్రయ్య, నాగరాజు, మస్తాన్ పాల్గొన్నారు.

అమరాలో 'అవయవదాన' ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - రేణిగుంట

అమర ఆస్పత్రి ప్రాంగణంలో రోగులు, సహాయకులతో అవయవ, కణజాల దానం అవగాహన సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రపంచ అవయవదానం దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నామన్నారు. ప్రజలు తమ అవయవాలను దానం చేయడానికి ప్రతిజ్ఞ చేయాలన్నారు. క్రిటికల్ కేర్ విభాగానికి చెందిన డాక్టర్ శంకర్ వల్లపు హెచ్‌ఒడి అవయవదానంలో అపోహలు–వాస్తవాలుతో సెషన్ ముగిసింది. ఈ కార్యక్రమంలో అమర ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ ప్రసాద్ గౌరినేని, మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి గౌరినేని పాల్గొన్నారు.

కాళ్లరిగినా..కాటికి కాళ్ళు చాపినా..

● పరిష్కారం కాని భూ సమస్యలు ● ఇప్పటికీ 99శాతం రెవెన్యూ వినతులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి


తరాలు మారినా.. ప్రభుత్వాలు తారుమారైనా నియోజకవర్గంలోని భూ సమస్యలకు పరిష్కారం దొరకడం లేదు.. కాళ్లకు చెప్పులరిగేలా తిరిగినా.. ఆఖరికి కాటికి కాళు చాపే వయసొచ్చినా రెవెన్యూ సమస్యలకు మాత్రం అధికారులు శాశ్వత పరిష్కారాలను చూపలేకపోతున్నారు. ఫలితంగా బాధితులు ఫైళ్లను చేతపట్టుకుని ఏళ్ళకేళ్ళు ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయడం తప్పా ఒరిగిందయితే ఏమీ లేదు. ప్రభుత్వం గ్రీవెన్స్ సెల్ పేరుతో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక సత్ఫలితాలనివ్వడం లేదనే చెప్పాలి. రెవెన్యూ సదస్సులు, భూముల రీ సర్వే కార్యక్రమాలు సైతం బాధితులకు స్వాంతన చేకూర్చడం లేదు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజల నుంచి ఏకంగా 2500 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 99 శాతం ఫిర్యాదులు భూ సమస్యలే కావడం ఇందుకు నిలువెత్తు నిదర్శనం.

40 ఏళ్లుగా ఇంటి పట్టాల కోసం: కన్నలి దళితులు



స్వయం ఉపాధి కింద 1982లో దళితవాడలో అగ్గి పెట్టెల పరిశ్రమను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదరణ కరువవడం, తుపాన్ కారణంగా పరిశ్రమ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. పరిశ్రమ కోసం ఏర్పాటు చేసుకున్న చిన్నపాటి గదుల్లో పది కుటుంబాల వారు కాపురాలుంటున్నాం. కొందరు పాడైన ఇళ్ల స్థానంలో కొత్తవి కట్టుకున్నారు. కొందరు పాత రూముల్లోనే నివాసం ఉంటున్నారు. అయితే ఈ స్థలానికి పట్టాలు ఇవ్వమంటే అధికారులు చుక్కలు చూపెడుతున్నారు. తీరా అది మందబయలు భూమని చెబుతూ నలబై ఏళ్లుగా తిప్పించుకుంటున్నారు. ఈ క్రమంలో పది మందిలో ఐదుగురు చనిపోయారు. తామైనా చనిపోకముందే అధికారులు న్యాయం చేయాలి.

మా భూమిని ఆక్రమించుకున్నారు: పి. మణి, గుండ్ల కండ్రిగ, ఏర్పేడు మండలం



మాది నిరుపేద కుటుంబం. నాకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక అబ్బాయి. మా తాతల కాలం నుంచి వస్తున్న రెండెకరాల ప్రభుత్వ భూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. అయితే గత ముప్పై ఏళ్లుగా పట్టా కోసం కాళ్లరిగేలా తిరిగినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. అయితే నా భూమిలోని 80 సెంట్లను కొందరు ఆక్రమించారు. వారికి రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారు. కలెక్టర్ న్యాయం చేయాలి.

రికార్డులు తారుమారు చేశారు: రాజనాల, చియ్యవరం గ్రామం, తొట్టంబేడు మండలం



నా తోపాటు నా తల్లి పై ఉన్న భూమి రికార్డులను రెవెన్యూ అధికారులు రాత్రికి రాత్రే మార్చేశారు. స.హ చట్టం ద్వారా కూపీ లాగితే 2022లో అప్పటి తహశీల్దార్ దొడ్డి దారిలో ఈ పని చేసినట్లు బయటపడింది. గ్రామంలోని ఓ దళారి, ఆయన కుటుంబ సభ్యుల పైన సుమారు 8 ఖాతాల్లో 80 ఎకరాలకు పైగా భూమిని ఎలాంటి రికార్డులు లేకుండానే రెవెన్యూ అధికారులు కట్టబెట్టారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలి.

వెయ్యి అడుగుల జాతీయ జండాతో 'తిరంగా'ర్యాలీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతని, అందరూ ఆ దిశగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, టూరిజం, ఎస్.వి యునివర్సిటీ సంయుక్తంగా మహతి ఆడిటోరియం నుండి ఎస్.వి యూనివర్సిటీ స్టేడియం వరకు వెయ్యి అడుగుల భారీ జాతీయ జెండాతో విద్యార్థిని విద్యార్థులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ వెయ్యి అడుగుల త్రివర్ణ పతాక ప్రదర్శన ర్యాలీని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, కమిషనర్ ఎన్.మౌర్య జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను రెండు వారాల పాటు నిర్వహించుకోవాలని, ఈ వేడుకల్లో కేవలం జెండా పట్టుకుని తిరగడమే కాకుండా దేశభక్తిని చాటాలని అన్నారు. మన పరిసరాలను, మన నగరాన్ని శుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యతని, యువత దేశాభివద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వే ఫౌండేషన్ సంస్థ అందించిన వెయ్యి అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. భారతదేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని, 2050 నాటికి మొదటి స్థానానికి చేరుకోవడానికి యువత కషి చేయాలని అన్నారు. దేశం యొక్క పురోగతి గురించి అపోహలు తొలగించి, దేశాన్ని మొదటి స్థానంలో ఉంచడానికి తోడ్పాటును అందించాలని అన్నారు.

నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ గతంలో కేవలం ఆఫీసులు, సంస్థల్లో మాత్రమే జెండా ఎగురవేసే వారని అన్నారు. ఇప్పుడు ప్రతి ఇంట్లో జెండా ఎగురవేసేలా ప్రోత్సహించడానికి రెండు వారాల కార్యక్రమం రూపకల్పన చేసి ప్రారంభించామని అన్నారు. సెల్ఫీ పాయింట్ వద్ద మీరు సెల్ఫీ దిగి అప్లోడ్ చేస్తే సర్టిఫికెట్ ఇస్తారని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశభక్తిని ఒక రోజుకే పరిమితం చేయకుండా, ప్రతిరోజూ మన పనుల్లో ఆ స్ఫూర్తి కనిపించేలా ఉండాలని అన్నారు. తిరుపతి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని అన్నారు. కాబట్టి, ప్రతి ఒక్కరూ బాధ్యతగా నగర పరిశుభ్రతకు తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని కోరుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వూకా విజయ్ కుమార్, డిప్యూటీ మేయర్ ఆర్.సి. మునికష్ణ, ఎస్వీయూ వైస్ ఛాన్సలర్ అప్పారావు, టూరిజం ఆర్ డి రమణ ప్రసాద్, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి జనార్ధన్ పాల్గొన్నారు.

– తిరుపతి పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను మంగళవారం కమిషనర్ ఎన్.మౌర్య అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్య అతిథులు, అధికారులు, అవార్డుగ్రహీతలు, స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబ సభ్యులు కూర్చునేందుకు వీలుగా ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేయాలని సూచించారు.కమిషనర్ వెంట ఆర్డీవో రామ్మోహన్, తుడా ఈ.ఈ. రవీంద్ర, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డి.ఈ. మహేష్ ఉన్నారు. అలాగే వినాయక చవితి సందర్భంగా వినాయకసాగర్‌లో జరిగే నిమజ్జన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని ఆదేశించారు.

– గూడూరు టౌన్‌లో ఎస్‌కెఆర్ డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమాన్నిప్రిన్సిపాల్ కె.శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయజెండాతో ఫొటో దిగి, హర్ ఘర్ తిరంగా వెబ్‌సైట్‌లో పోస్టు చేసి అందరిలో జాతీయ భావాన్ని పెంపొందించాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసులు, ఎన్‌సిసి కోఆర్డినేటర్ మైమూన్ పాల్గొన్నారు.



అదనపు రేషన్ బియ్యం విడుదల

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి జిల్లాలో గత నెలలో 65 వేల రేషన్ కార్డుదారులకు బియ్యం అందలేదని గుర్తించిన సిపిఎం నాయకత్వం కలెక్టర్‌కు, జేసీకి ఫిర్యాదు చేయడమే గాకుండా, పౌరసరఫరా కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించింది. పోర్టబులిటి వలన ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారు రేషన్ తీసుకోవడం వల్ల అనేక రేషన్ షాపుల్లో స్థానిక కార్డుదారులకు రేషన్ అందడం లేదని జిల్లా పౌరసరఫరా అధికారికి వివరించింది. అయితే ఆగస్టు నెలలోనూ గత నెలలో వలెనే కోటా విడుదల చేశారు. పది రోజుల్లోనే రేషన్ బియ్యం సరఫరా పూర్తయ్యి 'నోస్టాక్' బోర్డు పెట్టేశారు. దీంతో సిపిఎం మరోసారి ఆందోళనకు పూనుకుంది. స్పందించిన అధికారులు రేషన్ షాపులకు అదనపు కోటాను మంగళవారం విడుదల చేశారు. జిల్లాలో 15వ తేదీ వరకు రేషన్ షాపుల్లో రేషన్ అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. ఇదంతా సిపిఎం పోరాట ఫలితంగానే పేదలకు ఇబ్బంది లేకుండా రేషన్ బియ్యం అందుతుందని జిల్లా కార్యదర్శి వి.నాగరాజు ఓ ప్రటకనలో పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో ముగ్గురికి నామినేటెడ్ పదవులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 31 పదవులను భర్తీ చేస్తూ జాబితాను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లా నుంచి ఆంధ్రప్రదేశ్ మొదలియార్ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా సిఎస్ త్యాగరాజన్‌ను ప్రకటించింది. అలాగే తిరుపతి జిల్లాకు సంబంధించి కూటమికి చెందిన హిందూ ధర్మపరిరక్షణ ట్రస్టుకు దాసరి శ్రీనివాసులును నియమించింది. బెస్త సంక్షేమ బోర్డు రాష్ట్ర ఛైర్మన్‌గా సూళ్లూరుపేట నియోజకవర్గం తడ మండలానికి చెందిన టిడిపి సీనియర్ లీడర్ శ్రీధర్‌ను పదవి వరించింది.



త్వరలోనే శెట్టిపల్లి భూ సమస్యకు పరిష్కారం : కలెక్టర్

డిజైనింగ్, మ్యాపింగ్ పూర్తి చేశామన్న తుడా ఛైర్మన్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

శెట్టిపల్లి భూముల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. మంగళవారం తిరుపతి తుడా కార్యాలయంలో శెట్టిపల్లి భూముల సమస్యలపై తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఇతర అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా శెట్టిపల్లి భూముల రైతులు, ఫ్లాట్స్ కొనుగోలుదారులు జిల్లా కలెక్టర్ ను, తుడా ఛైర్మన్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. శెట్టిపల్లి భూముల సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని కలెక్టర్ తెలియజేశారు. శెట్టిపల్లి భూములపై ఇప్పటివరకు 60కి పైగా కేసులు నమోదయ్యాయని, అయినా ప్రజల ప్రయోజనం దష్టిలో ఉంచుకుని ముందుకు వెళుతున్నామని వివరించారు. తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి శెట్టిపల్లి భూముల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారని గుర్తు చేశారు. వీలైనంత త్వరగా రైతులకు, ప్లాట్ కొనుగోలుదారులకు భూములను అప్పగించడం జరుగుతుందన్నారు.తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ఏళ్ల తరబడి పరిష్కారం కానీ శెట్టిపల్లి భూముల సమస్య తన మొదటి అజెండగా తీసుకొని తాను తుడా ఛైర్మెన్ గా బాధ్యతలు చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రితోను, జిల్లా ఇన్ఛార్జి మంత్రితో చర్చించి ఒక కొలిక్కి తీసుకువచ్చామని తెలియజేశారు. ఇప్పటికే భూములు మ్యాపింగ్, డిజైనింగ్ పూర్తి చేసామని కార్పొరేషన్ నుంచి తుడా కు ఈ శెట్టిపల్లి భూముల ఫైల్ బదిలీ అయిన వెంటనే ప్రభుత్వ అనుమతితో భూములను లబ్ధిదారులకు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఆగస్టు 6న జరిగిన క్యాబినెట్‌లో సమస్యను చర్చించకుండా, త్వరలోనే అని కలెక్టర్ మరోసారి బాధితులను మభ్యపెట్టడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు విమర్శించారు.

రైలు కిందపడి వృద్ధుడు ఆత్మహత్య



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రైలు కిందపడి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న దుర్ఘటన సోమవారం తెల్లవారు జామున కాపుగున్నేరి సమీపంలో చోటుచేసుకుంది. మృతి చెందిన వ్యక్తి శ్రీకాళహస్తి రూరల్ మండలం ఎగువ వీధి దళిత వాడకు చెందిన పి.వెంకటయ్య (74)గా రైల్వే పోలీసులు గుర్తించారు. కుటుంబ కలహాల కారణంగా వెంకటయ్య రేణిగుంట వైపు వెళుతున్న అమృత భారత్ రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడినట్లు రైల్వే ఎస్ఐ ధర్మేంద్ర రాజు, హెడ్ కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి, కుందేటివారి వీధికి చెందిన ప్రవీణ్ కుమార్ (30) రెండు నెలల నుంచి కనబడడం లేదని ఆయన సోదరి పావని సోమవారం టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాకినాడలో చేపలు పట్టడానికి వెళ్లి ఇంతవరకు రాలేదని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సెల్: 9440900008 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల దొంగల ముఠా అరెస్ట్



ప్రజాశక్తి - చిట్టమూరు : విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ధ్వంసం చేసి, రాగి తీగలను అమ్ముకుంటున్న దొంగల ముఠాను చిట్టమూరు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి 175 కిలోల రాగి కాయిల్స్, 338 కిలోల అల్యూమినియం వైర్లను, ఒక వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. 8 కేసుల్లో ఏకంగా 38కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లను ఈ గ్యాంగ్ ధ్వంసం చేసి, దొంగతనాలకు పాల్పడుతూ రెండేండ్లుగా తప్పించుకు తిరుగుతోందని తెలిపారు. ఈ ముఠాను గూడూరు డిఎస్పి ఆధ్వర్యంలో, వాకాడు సీఐ పర్యవేక్షణలో, చిట్టమూరు ఎస్ఐ చిన్న బలరామయ్యకు అందిన సమాచారం మేరకు మంగళవారం మండల పరిధిలోని కలుగుర్తిపాడు వద్ద అనుమానాస్పదంగా వెళ్తున్న వాహనాన్ని పట్టుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వాకాడు సిఐ హుస్సేన్ భాష మంగళవారం మీడియాకు వెల్లడించారు. చిట్టమూరు మండలం ఆరూరుకు చెందిన గంగిపంగి వెంకటేష్, ఎర్రబెల్లి పోలయ్య, కంటేపల్లి కోటేశ్వరరావు, కంటేపల్లి సుబ్బయ్య, కంటేపల్లి గిరిబాబు అనువారిని అరెస్టు చేసి, వ్యాన్ సీజ్ చేసి కోర్టుకు హాజరపరచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై చిన్న బాలరామయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: బంగారుపాళ్యం మండలం, తగ్గువారిపల్లికి చెందిన హెడ్ కానిస్టేబుల్ కామరాజు మంగళవారం గుండె పోటుతో మృతి చెందారు. ప్రస్తుతం ఆయన హెడ్ కానిస్టేబుల్‌గా తిరుచానూరు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నారు. కాటంరాజుకి మంగళవారం ఉదయం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. ఆసుపత్రిలో పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

నీటి కుంటలో పడి విద్యార్థి మృతి



మృతి చెందిన భార్గవ్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - వి కోట : మండల పరిధిలోని యాలకుల్లు గ్రామంలో ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు యాలకల్లు గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు భార్గవ్ (11) వి.కోట చైతన్య పాఠశాలలో 6 వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం పాఠశాల విడిచిన అనంతరం స్కూల్ బస్సులో గ్రామానికి చేరుకున్నాడు. ఇంటికి వెళ్లి యూనిఫామ్ దుస్తులు మార్చుకుని, పొలం వద్ద ఉన్న అమ్మ కోసం కుంట పక్కనుండి వెళ్తూ ప్రమాదవశాత్తు కాలుజారి నీటి కుంటలో పడిపోయాడు. పాఠశాలకు వెళ్లిన కొడుకు ఎంత సమయం అయినప్పటికీ కనబడకపోవడంతో ఆ తల్లి పాఠశాలకు ఫోన్ చేసి విచారించగా స్కూల్ వ్యాన్లో పిల్లవాడు గ్రామంలో దిగినట్లు తెలుసుకొని ఆందోళనకు గురైంది. కుటుంబ సభ్యులు గ్రామస్తులు చుట్టుపక్కల బాలుడు ఆచూకీ కోసం వెతుకగా నీటి కుంటలో తేలియాడుతూ కనబడ్డాడు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా



ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: గత సంవత్సరం పోలేరమ్మ జాతరలో పోలీసులు జరిపిన లాఠీచార్జిలో తీవ్రంగా గాయపడిన చెంచు కుమార్ అనే దళితుడికి నష్టపరిహారం చెల్లించాలని, రెండు ఎకరాల భూమి ఇవ్వాలని తదితర డిమాండ్ల సాధన కోసం మంగళవారం దళిత సంఘాలు, గిరిజన సంఘాలు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో వెంకటగిరి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పల్లిపాటి రవి, మాట్లాడుతూ గత సంవత్సరం జరిగిన పోలేరమ్మ జాతరలో చెంచు కుమార్ అనే దళితుడు పీపా ఊదినందుకు పోలీసులు విచక్షణా రహితంగా లాటి ఛార్జ్ జరిపారన్నారు. దళిత సంఘాలు, వామపక్ష పార్టీలు, గిరిజన సంఘాలు చేపట్టిన ఆందోళనకు స్పందించిన వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ, సీఐ ఎంవి రమణ, తహశీల్దాలు కలిసి దళితుడికి న్యాయం చేస్తామని, రెండు ఎకరాలు భూమి ఇస్తామని, ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. సంవత్సరం రోజులు కావస్తున్నా ఇచ్చిన హామీ ప్రకారం దళితుడికి ఇంతవరకు రెండు ఎకరాలు భూమి చూపించలేదని, ఔట్సోర్సింగ్ ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి దళితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 20వ తేదీ లోపల దళితుడికి రెండు ఎకరాల భూమి ఇవ్వకపోతే 20వ తేదీ నుండి దళిత సంఘాలు గిరిజన సంఘాలు వామపక్ష పార్టీలు ఇతర ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఉదయభాస్కర్ ఎమ్మార్పీఎస్ నాయకులు మణి ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం వెంకటగిరి మండల కార్యదర్శి ఎన్ చిరంజీవి మహిళా సంఘం నాయకులు ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

దైవదర్శనానికి వెళుతూ.. నలుగురు దర్మరణం



బ్రిడ్జి పై నుండి కింద పడి ఉన్న కారు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: తమిళనాడు, తిరుత్తణి సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానానికి కావిడి ఎత్తుకొని వెళుతూ మార్గమధ్యంలో జరిగిన ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, ముగ్గురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గంగాధర నెల్లూరు మండలం వేపంజేరి పంచాయతీ గోవిందరెడ్డి పల్లికి చెందిన వైసీపీ నాయకుడు మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి తమ్ముడు విశ్వనాథ రెడ్డి కుటుంబ సభ్యులు మంగళవారం ఇంటి నుండి తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానానికి కావిడి ఎత్తుకొని కారులో బయలుదేరారు. ఈ కారులో విశ్వనాథ రెడ్డి, ఆయన భార్య రేఖ, వదిన చిట్టెమ్మ, అన్న కుమార్తె కీర్తి, అన్న మనవడు షాన్విక్ రెడ్డి, గ్రామస్తురాలు (పనిమనిషి) పద్మ, గోవిందరెడ్డి పల్లి నుండి తిరుత్తణికి ప్రయాణిస్తూ అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిపై నుండి కారు కిందపడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న గ్రామస్తురాలు పద్మ అక్కడికక్కడే మృతి చెందగా, ఆసుపత్రికి తరలించే మార్గమధ్యంలో విశ్వనాథరెడ్డి మృతి చెందారు. మృతుడి భార్య, వదిన, అన్న కుమార్తె తీవ్ర గాయాలతో రాణిపేట సీఎంసీలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో విశ్వనాథ రెడ్డి అన్న కుమార్తె కీర్తి, కుమారుడు శాన్విక్ రెడ్డి (1 ఒక సంవత్సరం లోపు) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.



మృతి చెందిన పద్మ



గాయాలతో చిట్టెమ్మ, కీర్తి

రైతులను మోసం చేసిన దళారికి జైలు శిక్ష



ప్రజాశక్తి-వెంకటగిరి : వెంకటగిరి మండల పరిధిలోని కుర్జాగుంట రైతును మోసం చేసిన కేసులో దళారికి 18నెలల జైలు శిక్షను ఖరారు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జడ్జి విష్ణు వర్మ ఈకేసును పరిశీలించి కర్ణాటక రాష్ట్రం, దావనగిరి జిల్లాకు చెందిన దళారి వి.శ్రీనివాస్‌ను ఆధారాలను పరిశీలించి నెల్లూరులోని సెంట్రల్ జైలుకు పంపారు. కుర్జాగుంట గ్రామానికి రైతు ఆర్.జనార్ధన్ మాట్లాడుతూ తన వద్ద వడ్లు కొనుగోలు చేసి తనకు దావనగిరి చెందిన శ్రీనివాసులు 28లక్షల 8వేల 647 రూపాయలు తనకు చెక్కు ఇచ్చాడన్నారు. చెల్లించే క్రమంలో తన ఖాతాలో చెక్కును వేయగా చెక్కు బౌన్స్ అయిందన్నారు. వెంటనే తాను వెంకటగిరి జూనియర్ సివిల్‌జడ్జి కోర్టును ఆశ్రయించగా వారెంట్ జారీ చేశారన్నారు. వెంకటగిరి పోలీసువారు ముద్దాయిని వెంకటగిరి పోలీసుస్టేషన్ తీసుకొని వచ్చిన విషయాన్ని ప్రజాశక్తి వెలుగులోకి తీసుకొని రావడంతో చట్టుపక్కల రైతులందరూ తాము కూడా ఇతని వద్ద మోసపోయినట్లు కోర్టును ఆశ్రయించడంతో అతనికి జరిమానాతో కలిపి 57లక్షల 61వేల 294 రూపాయలు రైతులకు కట్టాలని ఆర్డర్ జారీ చేశారు. 18నెలల జైలు శిక్షను ఖరారు చేశారు. త్వరగా కేసును పరిష్కరించడంతో జడ్జిను పలువురు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి -కోట : వినాయక చవితి ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ అనుమతులు తీసుకోవడమే కాకుండా ప్రతిఒక్కరు నిబంధనలను పాటించి వేడుకలను జరుపుకోవాలని కోట తాహాసిల్దార్ కటారి జయ జయరావు, ఎస్సై పవన్ కుమార్‌లు తెలిపారు. మంగళవారం కోట స్థానిక తాహాశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వేడుకల్లో చట్ట విరుద్ధంగా రాత్రి 10 తర్వాత డిజేలు, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో స్థానిక ఇంచార్జి ఎంపిడిఓ ఏకొల్లు వేణు, ఇరిగేషన్ జేఈ మునిరత్నం, వర్క్ ఇన్స్పెక్టర్ అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్ఏ 'తాటిపర్తి'కి నేతల నివాళి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మాజీ ఎమ్మెల్యే, వైసిపి సీనియర్ నాయకులు తాటిపర్తి చెంచు రెడ్డికి పలువురు నివాళులు అర్పించారు. అనారోగ్యంతో బాధపడుతూ చెంచు రెడ్డి సోమవారం మతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని పట్టణంలోని నారాయణ స్కూల్ వద్ద ఉంచి బుధవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చెంచు రెడ్డి భౌతిక కాయానికి నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, వెంకటేష్ లు చెంచు రెడ్డి మతికి నివాళులర్పించారు.

దిష్టిబొమ్మగా 'మేర్లపాక రైతుసేవా కేంద్రం'



ప్రజాశక్తి -ఏర్పేడు : రైతుకు విత్తనాల నుండి ధాన్యం విక్రయాలు వరకు రైతన్నలకు సేవలందించాలనే దృక్పథంతో గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్మించింది. ఈ క్రమంలో ఏర్పేడు మండలంలో 17 రైతు భరోసా కేంద్రాలు పురుడు పోసుకున్నాయి. అవి ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో రైతు సేవా కేంద్రాలుగా కొలువుదీరుతున్నాయి.ఈ 17 రైతు సేవ కేంద్రాలలో రైతులకు సేవలందించని కేంద్రం ఒకటుంది. అదే మేర్లపాక దళితవాడ సమీపంలో ఓ వెంచర్ లోని ప్రభుత్వ స్థలంలో గతంలోనే రూ.23 లక్షల వ్యయంతో నిర్మించారు. ఈ నిర్మాణానికి మునపట గ్రామంలోని తాత్కాలిక భవనంలో పోస్ట్ ఆఫీస్ నిర్వహిస్తున్న మినీ అంగన్వాడీలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అది పాత భవనం కావడంతో శిథిలావస్థకు దగ్గర్లో ఉంది. కానీ ఈ పాత భవనంలోనే కొనసాగించడంలో అంతర్యం ఏమిటో? లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు సేవ కేంద్రం ఖాళీగా వదిలేయటం ప్రభుత్వ నిధులు వధా చేయడమే కానీ మరేంటి లేదని రైతులు మండిపడుతున్నారు. ఇకనైనా నూతనంగా నిర్మించిన రైతు సేవ కేంద్రాన్ని వినియోగంలోకి తెచ్చి రైతులకు అండగా ఉండాలని కోరారు.

ఏనుగులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయొద్దు

ఎలిఫెంట్ టాస్క్ ఫోర్స్ అప్రమత్త సమాచారాలు ఇస్తోంది: సబ్ డిఎఫ్ఓ నాగభూషణం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అటవీ సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఆహార అన్వేషణలో భాగంగా వచ్చి ఏనుగుల గుంపులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయొద్దని, ఏనుగులు కనిపిస్తే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని తిరుపతి సబ్ డివిజన్ ఫారెస్ట్ ఆఫీసర్ నాగభూషణం సూచించారు. మంగళవారం తిరుపతి కపిలతీర్థం వద్ద గల అటవీశాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతి జిల్లా పరిధిలో భాకరాపేట, పనభాకం, తిరుపతి రేంజ్‌లలో ఏనుగుల దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, పలు పోటీలను నిర్వహించి బహుమతి ప్రదానం చేసామన్నారు. అలానే తిరుపతి శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శనశాలలో కూడా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఏనుగుల గుంపు సంచరించే సమయం, ప్రాంతాలలో తెల్లటి దుస్తులను ధరించి ఏనుగుల కంట పడకూడదని, దాని దృష్టి మరల్చడానికి టవ్వాలు వంటివి విసిరివేసి లోతైన ప్రాంతానికి పరిగెత్తాలన్నారు. ఇలా చేయడం వలన ఏనుగు దృష్టి మరల్చడానికి సహాయపడుతుందన్నారు.

ఎలిఫెంట్ టాస్క్ ఫోర్స్ అప్రమత్తత.. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని 12 అటవీ రేంజ్ లలో ఎలిఫెంట్ టాస్క్ ఫోర్స్ నిరంతరం ఏనుగుల కలదలికలపై నిఘా ఉంచి వాటి గమనానికి సంబంధించి అప్రమత్తత కోసం గ్రామస్తులు లైన్ డిపార్ట్మెంట్‌లతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని పంపిస్తున్నారన్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఏనుగుల సంచారం పట్ల అప్రమత్తమై పంట పొలాల వద్దకు చీకటి పడే సమయంలో వెళ్లకుండా ఉండేట్టు తగిన జాగ్రత్తలను ఇస్తున్నామన్నారు. ఏనుగులను రెచ్చగొట్టడానికి టపాకాయలు కాల్చడం, విజిల్ వేయడం, గట్టిగా కేకలు వేయడం వంటివి చేయకూడదని ఇప్పటికే అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలకు సూచించడం జరిగిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి




వేణుగోపాల్ రెడ్డి (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: మండలంలోని గడ్డూరు పంచాయతీ కోట్రేపల్లికి చెందిన టీడీపీ నాయకుడు వేణుగోపాల్ రెడ్డి (58) మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ప్రస్తుతం ఆయన గడ్డూరు గ్రామ పంచాయతీ టీడీపీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. బైరెడ్డిపల్లి నుండి కోట్రేపల్లికి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా, కూటాలవంక వద్ద వాహనం అదుపుతప్పి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పలమ నేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఈ ఘటనపై మండల టీడీపీ అధ్యక్షుడు రాధకిషోర్ గౌడ్, కార్యదర్శి సుబ్రమణ్యం శెట్టి, పలమనేరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు భువనచంద్ర గౌడ్, స్థానిక నాయకులు కృష్ణమూర్తి, మంజునాథ్ రెడ్డి తదితరులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

వేళకు రారు.. పని చేయరు..!

సచివాలయ సిబ్బంది పనితీరుపై ప్రజల ఆగ్రహం





ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రజలకు త్వరిత సేవలం దించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ, పుత్తూరులో నిర్లక్ష్యానికి మారుపేరయిందని ప్రజలు మండిపడుతున్నారు. "సేవ" అనే పేరుతో మొదలైన ఈ వ్యవస్థ ఇప్పుడు "సమస్యల పంపివేత కేంద్రం"గా మారిందని ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. ఎన్జీవో కాలనీ సచివాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం, సమయానికి రాకపోవడం, వచ్చినా ఫోన్ సంభాషణలు, వ్యక్తిగత పనులకే ప్రాధాన్యం, ఇదే ఇక్కడి నిత్య చర్యగా మారింది. ప్రజలు ఏ సమస్యతో వచ్చినా సమాధానం ఒక్కటే "ఎంఆర్ఓ ఆఫీసుకి వెళ్లండి లేదా కమిషనర్ ఆఫీసుకి వెళ్లండి." రేషన్ కార్డు, పెన్షన్, పౌర సౌకర్యాలు, పన్నుల సమస్యలు ఏదైనా కావచ్చు, పరిష్కారం ఇవ్వడం పక్కనపెట్టి బాధ్యత నుంచి తప్పించుకోవడమే లక్ష్యం అన్నట్లుంది. "అక్కడికే వెళ్ళమంటే ఇక్కడ సచివాలయం ఎందుకు?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ పరిస్థితిని పర్యవేక్షిం చాల్సిన రెవెన్యూ అధికారులు, మున్సిపాలిటీ కమిషనర్‌లు కూడా పట్టించుకోవడం లేదు. ప్రజలకు అందుబాటులో సేవలు ఇవ్వడమే ఉద్దేశమ యితే, అవి లేని సచివాలయాలపై కోట్ల రూపా యలు ఖర్చు చేయడం ఎందుకు? కేవలం భవనా లకే పరిమితమైపోతే, అవి సేవా కేంద్రాలు కాదు మ్యూజియంలని స్థానికులు విమర్శిస్తున్నారు.

> పుత్తూరు మున్సిపాలిటీ పనితీరు ఘోరంగా తయారయింది. నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలి.
>
> **- నాగార్జున కటికం, పుత్తూరు మండలం**

> సచివాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న విషయం మా దృష్టికి రలేదు. విచారించి తగు చర్యలు తీసుకుంటాం.
>
> **- మంజునాథ్ గౌడ్, కమిషనర్**

హథీరాంజీ మఠం అధికారులు ఏకపక్ష ధోరణి వీడాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) తిరుమల శ్రీవారికి పరమ భక్తుడైన శ్రీ స్వామి హథీరాంజీ మఠం అధికారులు ఏకపక్ష ధోరణి వీడి, మఠం భవనాన్ని, లీజు దారులను కాపాడాలని తిరుపతి నగరపాలక సంస్థ కార్పొరేటర్ నరసింహాచారి విజ్ఞప్తి చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మఠం భవనం శిథిలావస్థకు చేరిందని, దుకాణదారులు షాపులు ఖాళీ చేయాలని చెబుతున్న అధికారులు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మద్రాస్ ఐఐటి వారిచే అధ్యయనం చేయిస్తానని చెప్పినా ఏకపక్షంగా వ్యవహరిస్తూ మఠం భవనాన్ని కూల్చడానికి ప్రయత్నాలలో భాగంగా టెండర్లకు ఆహ్వానించడం దారుణం అన్నారు. దాదాపు 60 మంది కుటుంబాలు మఠం భవనాన్ని ఆనుకుని దుకాణాలు నిర్వహించుకుంటూ బతకీడుస్తున్నా రని, వారి పొట్ట కొట్టడం భావ్యం కాదన్నారు. టెండర్ లో మఠం కూల్చివేసి అక్కడి వస్తువులు తీసుకెళ్ళచ్చని పేర్కొనడం చూస్తుంటే సొంతవారే మఠంలోని విలువైన వస్తువులను ధారాదత్తం చేయడానికి పూనుకున్నట్టుగా అనుమానం వ్యక్తం చేస్తున్నామన్నారు. గత మహంతు అర్జున్ దాస్ వ్యవహరించినట్లుగా ప్రస్తుతం ఉన్న మఠం అధికారులు వ్యవహరించడంతో మఠం ప్రతిష్ట దిగజారి పోతుందన్నారు. దాదాపు 145 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ స్వామి హథీరాంజీ మఠం భవనాన్ని ఇలా అధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ కూల్చివేయడానికి సిద్ధమవుతుంటే హైందవ ధర్మాన్ని కాపాడాల్సిన వారు, సనాతన ధర్మాన్ని భుజానెత్తుకున్న వారు ఎందుకు మౌనం వహిస్తున్నారు అని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఉన్న ఈ సమస్యకు తగిన పరిష్కారం కోసం మఠం అధికారులు వేచి ఉండాలని, లేనిపక్షంలో లీజు దారులతో కలసి బహిరంగ పోరాటానికి తాము సిద్ధమవుతున్నా మన్నారు. విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు పొన్నాల చంద్ర, నరేంద్ర, భాస్కర్, తిరుత్తని వేణుగోపాల్, లీజు దారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిమూలంపై సస్పెన్షన్ ఎత్తేయాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) సత్యవేడు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సమన్వయకర్తగా నియమింపబడ్డ శంకర్ రెడ్డి గ్రూపు రాజకీయాలకు తెరతీస్తూ కష్టపడిన వారిపై కేసులు పెట్టిస్తున్నారని, అధిష్టానం జోక్యం చేసుకొని ఎమ్మెల్యే ఆదిమూలం పై సస్పెన్షన్ ఎత్తివేసి పూర్తిస్థాయి స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాలని నాగలాపురం మాజీ ఎంపీపీ మురళి కోరారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో సత్యవేడు నియోజకవర్గంలోని పలు మండలాలకు సంబంధించిన వారు మాట్లాడారు. సత్యవేడు నియోజకవర్గంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే ఆదిమూలంపై ఎంతమంది పోటీ చేసినా తెలుగుదేశం పార్టీ క్యాడర్ కష్టించి పనిచేస్తూ విజయం సాధించేలా కషి చేశామన్నారు. అయితే ఆదిమూలంపై జరిగిన అభియోగం దష్ట్యా పార్టీ అధిష్టానం సస్పెన్షన్ వేటు వేసింది అని, ఇప్పుడు కేసుల విషయాలన్నీ పరిష్కారం అయిన నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదిమూలంపై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేయాలని, అలానే నియోజకవర్గంలో పార్టీ క్యాడర్ను సర్దుబాటు చేయాలని, అధిష్టానం పంపిన శంకర్ రెడ్డిని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా మన్నారు. లేకపోతే రాబోయే రోజుల్లో సత్యవేడు నియోజకవర్గంలో ఉన్న 66 శాతం ఎస్సీ సామాజిక వరానికి సంబంధించిన వారితో చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో కేవీబిపురం మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, నారాయణవనం మాజీ ఎంపీపీలు గోవిందస్వామి, భక్తవత్సలం, పిచ్చాటూరు మండల మాజీ జడ్పిటిసి సుమాంజలి, నారాయణవనం గ్రామపంచాయతీ సర్పంచ్ రవి పాల్గొన్నారు.

పవన్‌ను పరామర్శించిన కెవిపిఎస్ నేతలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: గిరిజనుడైన పవన్‌కుమార్‌ను కిడ్నాప్ చేసి, పాశవికంగా దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేశు, జిల్లా అధ్యక్షులు ఎన్.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. రుయాలో చికిత్స పొందుతున్న పవన్‌కుమార్‌ను వారు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్ మంగళవారం పవన్‌ను పరామర్శించారని, దాడికి పాల్పడిన వారిని శిక్షిస్తామని చెప్పారని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారు ఎవరు, ఎవరు కిడ్నాప్ చేశారు. భౌతికంగా దాడిచేసింది ఎవరు, తిరుపతి నుంచి చిత్తూరుకు తీసు కెళ్లింది ఎవరు, వీరి వెనకాల ఎవరు ఉన్నారో అందరినీ గుర్తించి వారిపై కేసులు పెట్టాలన్నారు. పవన్‌కు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.బాలసుబ్రమణ్యం, కె.వేణుగోపాల్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు చేపడతామని గూడూరు డీఎస్పీ గీతా కుమారి హెచ్చరించారు. గూడూరు డివిజన్ పోలీస్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గూడూరు డివిజన్ పరిధిలో గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల గూడూరు వన్ టౌన్‌కు చెందిన ఇద్దరు యువకులు గంజాయి విక్రయిస్తుండగా అరెస్టు చేశామన్నారు. హాస్పిటల్ రోడ్డులో ఒక దుకాణం గొడవ నేపథ్యంలో దుకాణంలో ఉన్న వ్యక్తిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశపూర్వకంగా నయుం అనే యువకుడు సుమారు 600 గ్రాముల గంజాయి పొట్లాలను దుకాణంలో ఉంచి గంజాయి విక్రయిస్తున్నట్లు ప్రచారం చేశారన్నారు. విచారించిన అనంతరం నయుం ఉద్దేశపూర్వకంగా చేశారని రూజువైందని అతనిని అదుపులోకి తీసుకొని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒకటవ పట్టణ సీఐ శేఖర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -ఏర్పేడు : రేణిగుంట, ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధి, ఏర్పేడు మండలంల, రాజుల పాలెం అంగన్వాడి కేంద్రానికి సంబంధించి ప్రజాశక్తి దినపత్రికలో మంగళవారం 'వర్షపు నీటితో..అంగన్వాడి వ్యధ ' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ క్రిష్ణవేణి పరిశీలించి నివేదిక ఇవ్వాలని సంబంధిత సూపర్వైజర్‌ని ఆదేశించగా, సూపర్వైజర్ రత్నమ్మ రాజులపాలెం అంగన్వాడి కేంద్రానికి వెళ్లి సంబంధిత సచివాలయ అధికారులను సమావేశపరచి, అంగన్వాడి కేంద్రానికి ఇరువైపులా సిమెంట్ రోడ్లు ఎత్తులో ఉన్నందున వర్షపు నీరు బయట పోవడానికి వీలుకావడం లేదని ప్రజాశక్తిలో వచ్చిన కథనం వాస్తవమేనని నిర్ధారించారు. వర్షపు నీరు లోపలికి రాకుండా వరండాకు ఇరువైపులా చిన్న గోడలు త్వరలోనే నిర్మిస్తామని పంచాయతీ అధికారులు హామీ ఇచ్చారని కృష్ణవేణి తెలిపారు.


ర్యాగింగ్ చేస్తే జైలు శిక్షే



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కొత్త విద్యార్థులకు విద్యాసంస్థల్లో భయం లేకుండా, గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడానికి యాంటీ ర్యాగింగ్ దినోత్సవం జరుపుకుంటామని డాక్టర్ చంద్రమౌళి పేర్కొన్నారు. మంగళవారం పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యాంటీ ర్యాగింగ్ సెల్ ఆధ్వర్యంలో ర్యాగింగ్ వ్యతిరేక దినోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ న్యాయవాది రాజేష్ హాజరై మాట్లాడుతూ ర్యాగింగ్ చేసే వారిపై పోలీస్ కేసు నమోదయితే విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరించారు. యాంటీ ర్యాగింగ్ సెల్ సమన్వయకర్త డాక్టర్ వెంకట కృష్ణయ్య విద్యార్థిని విద్యార్థుల చేత ర్యాగింగ్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకట కృష్ణయ్య, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుజన, డాక్టర్ కే. శ్రీదేవి, డాక్టర్ కే. శ్రీనివాసులు, పి. సూర్య బాబు, డాక్టర్ ఆర్. బి.వాణిశ్రీ, డాక్టర్ దేవకి, డాక్టర్ గాయత్రి, డాక్టర్ కోటేశ్వరరావు, పద్మావతి, డాక్టర్ వరలక్ష్మి తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి పారుదల శాఖ ఏఈ మృతి



ఏ.ఈ చినబాబు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు మండలం, పాపానాయుడపేట సెక్షన్‌కు సంబంధించి చిన్న నీటి పారుదల శాఖ ఏఈగా విధులు నిర్వహిస్తున్న చినబాబు మృతి చెందా రు. ఆయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడు తూ మంగళవారం ఉదయం మరణించారు. మండల టిడిపి అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు ఆయనకు నివాళులర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించారు. పేరం ధనంజయల నాయుడు, సుబ్రహ్మణ్యం, రవి నాయుడు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

పెద్ద దిక్కును కోల్పోయాం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాజకీయ గురువు తాటిపర్తి చెంచురెడ్డిని కోల్పోవడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్ రెడ్డి, బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. చెంచురెడ్డి భౌతిక కాయానికి మంగళవారం నివాళు లర్పించారు. తిరుపతి జిల్లా ఓ పెద్ద దిక్కును కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మరాజుల బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎంపీ



ఆలయంలో వెలగపల్లి వరప్రసాదరావు

ప్రజాశక్తి -ఏర్పేడు : పాపానాయుడు పేటలో నిర్వహిస్తున్న ధర్మరాజుల బ్రహ్మోత్సవాలకు రిటైర్డ్ ఐఏఎస్, మాజీ ఎంపీ వెలగపల్లి వరప్రసాదరావు విచ్చే సారు. వీరికి చేనేత సంఘం సభ్యులు దర్శన ఏర్పాటు చేశారు.

ఆశా వర్కర్లకు అభినందనలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాజీ లేని పోరాటాలతో గ్రాట్యూటీ, 180 రోజుల మెటర్నటీ లీవు, 62 సంవత్స రాలకు రిట్కెర్మెంట్ పెంపు జీఓ నెం.94 ను సాధించుకున్న ఆశాలను సిఐటియు నాయకులు అభినందించారు. ఏడాదికి రూ. 5 వేలు చొప్పున గరిష్టంగా రూ. 1,50,000 గ్రాట్యూటీలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ 94ను విడుదల చేయడంపై సిఐటియు జిల్లా కమిటీ హర్షం ప్రకటించింది.

నేడు చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ ప్రీతి రెడ్డి రాక



ప్రజాశక్తి-కోట: కోట మండలంలోని ఎన్సిఆర్ నగర్‌లో ఉన్న జనతా క్లినిక్‌కు నెల్లూరు నుండి ప్రముఖ చర్మవ్యాధి నిపుణుల డాక్టర్ పెళ్లకూరు ప్రీతి రెడ్డి బుధవారం వస్తున్నట్లు కోట జనతా క్లినిక్ ఆసుపత్రి డాక్టర్ ఎమ్.జగదీష్, డాక్టర్ ఉమేరాలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం డాక్టర్ జగదీష్ మాట్లాడు తూ ప్రతి నెల రెండవ బుధవారం చర్మ వ్యాధి నిపుణుల డాక్టర్ ప్రీతి రెడ్డి జనతా క్లినిక్ ఆసుపత్రికి వస్తారన్నారు. మొటిమలు, మచ్చలకు కెమికల్ ఫీల్ ద్వారా చికిత్స, మంగు, కళ్ళ క్రింద నల్ల వలయాలు, పలుచటి జుట్టు, బట్ట తలకు చికిత్స, బొల్లి వ్యాధికి అత్యాధునిక చికిత్స, చిన్నపిల్లల్లో వచ్చు చర్మ వ్యాధులు, జుట్టు సమస్యలు, ముఖంపై మచ్చలు (బొటాక్స్ ఇంజక్షన్), గజ్జి, కురుపులు, తామర, పుండ్లు, నోటి పుండ్లు మొదలగు అన్ని చర్మవ్యాధులకు చికిత్స అందించబడుతుం దన్నారు.ఈ మేరకు చర్మ వ్యాధులతో ఇబ్బంది పడేవారు ఈ అవకాశాన్ని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అపాయింట్మెంట్ కొరకు సంప్రదించవల సిన ఫోన్ నంబర్లు 9642414572, 9731577366.

ప్రైవేట్ బస్సు ఓనర్లు, సిబ్బంది జీవితాలతో ఆడుకోవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయు నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ నుండి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన నేపథ్యంలో ప్రవైట్ బస్సు ఓనర్లకు నష్టం జరగకుండా చూడాలని, వారి జీవితాలతో ఆడుకోవద్దని నేడు యశోద నగర్ సీఐటీయూ కార్యాలయం లో జరిగిన ప్రెస్ మీట్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిఐటియు నేతలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రైవేటు బస్సులకు నష్టం కలగకుండా ప్రభుత్వం విధి విధానాలు రూపొందించాలన్నారు. ప్రవేట్ బస్సుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ టాక్స్‌ల ద్వారా ఆదాయం వస్తుందన్నారు. తిరుపతిలో42 టౌన్ సర్వీస్ బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. వీటిపై వందల కుటుంబాలు బ్రతుకుతున్నాయన్నారు. ప్రవేటు బస్ ఓనర్లతో ప్రభుత్వం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ప్రవేటు బస్సులును అద్దే ప్రాతిపదికన తీసుకొని ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ నేతలు టి.సుబ్రమణ్యం, కే.వేణుగోపాల్, పి.బుజ్జి, బస్ ఓనర్లు శేషయ్య, శివ ప్రసాద్, వరదారెడ్డి, లోక, రవి, అయ్యప్ప, దొర, శివ, చంగల్ రాయులు, చిన్నదొర పాల్గొన్నారు.

డెత్ క్లైమ్‌లను పరిష్కరించేందుకు చర్యలు

రీజినల్ పిఎఫ్ కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

డెత్ క్లైమ్‌లను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కడప రీజినల్ పిఎఫ్ కమిషనర్ రవితేజ కుమార్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కడప ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయం పరిధిలో ఈపీఎఫ్వో సభ్యులు, యాజమాన్యాలు, పెన్షనర్లకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జులై నుంచి సెప్టెంబరు వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈపీఎఫ్ సభ్యుడు చనిపోయి నెలలు, ఏళ్లు గడుస్తున్నా డైత్ క్లైమ్లు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి కుటుంబ సభ్యులు యాజమాన్యాల ద్వారా కడప, కర్నూలు, అనంతపురం, తిరుపతి, నెల్లూరు జిల్లా కార్యాలయాల్లో సంబంధిత ధ్రువపత్రాలను అందజేయాలని సూచించారు. ఈపీఎఫ్ సభ్యుడు తన జీవిత కాలంలో యూనివర్సల్ అకౌంట్ నంబరు (యూఏఎన్)కు ఇ-నామినేషన్ జతచేసి ఉన్నట్లయితే.. అతని మరణాంతరం. అతడి కుటుంబ సభ్యులు ఆన్లైన్లోనే డెత్ క్లైమ్లు సమర్పించవచ్చు అన్నారు. కడప ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని యాజమాన్యాలు, ఈపీఎఫ్ సభ్యులు, నామినీలు డెత్ క్లైమ్లకు సంబంధించిన వివరాలను లేదా ఫిర్యాదులను 94911 38280 నంబరుకు ఫోన్ చేసిగాని వాట్సప్ ద్వారా గాని పంపవచ్చని తెలిపారు.

టూరిజం హబ్‌గా తీర్చిదిద్దండి..

కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ విజ్ఞప్తి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆంధ్రప్రదేశ్ పర్యాటకరంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని, చిత్తూరు పార్లమెంటును టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పార్లమెంట్ సమావేశాలకు హాజరైన చిత్తూరు ఎంపీ సర్వీసు ప్రొవైడర్ల సామర్థ్యం పెంపొందించే పథకానికి సంబంధించిన వివరాలను కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖను కోరారు. ఇందుకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ శఖావత్ సానుకూలంగా స్పందించి, లోక్‌సభలో సిబిఎస్‌పి పథకం వివరాలను తెలియజేసినట్లు ఎంపి వివరించారు. సేవా ప్రదాతల కోసం సామర్థ్య నిర్మాణం పథకం కింద, పర్యాటక మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోందని, అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, పథకం ప్రారంభించినప్పటి నుండి దేశవ్యాప్తంగా లక్షలాది మందికి శిక్షణ ఇచ్చారని, దీని ఫలితంగా నియామకాలు, స్వయం ఉపాధి, వ్యవస్థాపకత, ఉన్నత చదువులను ఎంచుకుని తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలో వేసుకున్న వారు ఉన్నారని, శిక్షణ పూర్తయిన తర్వాత 59210 మందికి నియామకాలు లభించాయని తెలిపారు.

సమర్థవంతంగా ఇంటింటి వ్యర్థాల సేకరణ

ఐటీసీ సంస్థతో కుదిరిన ఎంఓయు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి ఇంటి నుంచి వ్యర్థాల సేకరణ మరింత పక్కాగా, సమర్థవంతంగా సేకరించడానికి, తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచడానికి చిత్తూరు నగరపాలక సంస్థ ఐటీసీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రస్థాయిలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌తో కుదిరిన ఒప్పందంలో భాగంగా మంగళవారం సాయంత్రం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, ఐటీసీ సంస్థ డీజీఎం ఉమాకాంత్, ఏజీఎస్ గోపాలకృష్ణమూర్తితో సమావేశం నిర్వహించి ఎంఓయు కుదుర్చుకున్నారు. సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక పరిధిలో ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ, తడి, పొడి చెత్తగా వేరు చేయడం, వ్యర్థాల నిర్వహణ అంశాలపై ఐటీసీ క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. వ్యర్థాల నిర్వహణ, సెగ్రిగేషన్, ప్రాసెసింగ్ చేయడంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో కలిసి ఐటీసీ పనిచేస్తుంది. ఈ మేరకు కార్యక్రమాల నిర్వహణపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో ఎంహెచ్వో డాక్టర్ పి.లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఐటీసీ స్టేట్ కోఆర్డినేటర్ హేమ మహేశ్వరి, ఏఈ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



ఐటీసీ సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

సమస్యలపై పోరాడుతున్న

అంగన్వాడీలపై ఒత్తిడి తీసుకురావద్దు

సిడిపిఓతో యూనియన్ నాయకుల చర్చలు



సిడిపివోతో చర్చలు జరుపుతున్న సిఐటియు, అంగన్వాడీ నాయకులు

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు ప్రాజెక్టులో తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం పోరాడుతున్న అంగన్వాడీలపై అధికారులు ఒత్తిడి తీసుకువస్తూ ఇబ్బందులు గురిచేయడం సరైనది కాదని సిఐటియు జిల్లా అధ్యక్షులు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం సిఐటియు, ఐఎఫ్టియు నాయకులు సిడిపిఓతో చర్చలు జరిపారు. వాడ గంగరాజు, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి జ్యోతి, ప్రాజెక్టు కార్యదర్శి లీలావతి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం పోరాటం చేస్తూ పనిచేయని ఫోన్లను తిరిగి ఇచ్చేసి ఆన్లైన్ చేయకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నామని అన్నారు. ఒత్తిడి తీసుకురావడంతో ఎఫ్ఆర్ఎస్ అవుటు ఇన్ రద్దు చేశారని, ఇంకా వేతనాలు పెంచడం, మినీ అంగన్వాడీని మెయిన్ సెంటర్లుగా మార్చడం వంటి సమస్యలు అలాగే ఉన్నాయని వాటి పరిష్కారం కోసం పోరాడుతున్న అంగన్వాడీలను ఇబ్బందులకు గురిచేయడం, సూపర్వైజర్ల స్వయంగా వెళ్లి అంగన్వాడీల లాగిన్ తీసుకొని ఆన్లైన్ వర్క్ చేయడం దారుణమన్నారు. తమకు పైనుంచి ఒత్తిడి వస్తోందని అంగన్వాడీలను రకరకాల పద్ధతులలో మానసిక ఒత్తిడి చేయడం సరైనది కాదని అన్నారు. అధికారులకు యూనియన్ వ్యతిరేకం కాదని సమస్యలపై పోరాడుతున్న వారికి సహకరించాల్సిందిపోయి అవమానకరంగా మాట్లాడుతూ మానసికంగా ఇబ్బంది పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. అంగన్‌వాడీలను ఇలాగే ఇబ్బందులకు, ఒత్తిడికి గురిచేస్తే జరిగే పరిణామాలకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయండి : కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్టీఆర్ హౌసింగ్ గృహ నిర్మాణాల్లో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణం పురోగతిపై హౌసింగ్ అధికారులు, అమినిటీ కార్యదర్శులుతో సమీక్ష నిర్వహించారు. చిత్తూరు నగరపాలక పరిధిలో ఎన్టీఆర్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. వారం వారం నిర్దేశించిన లక్ష్యం మేరకు స్టేజ్ కన్వర్షన్ చూపించాలన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి పెండింగ్ పనులు పూర్తి చేయించాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించి పనులు వేగవంతం చేసేలా చూడాలన్నారు. ఎంఈ వెంకటరామి రెడ్డి, ఏఈ శ్రీధర్, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నరసింహ పసాద్

రామకుప్పం అభివృద్ధిపై కడ పీడీ సమీక్ష..!



ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలో చేపట్టాల్సిన వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమలపై మంగళవారం కడ పీడీ వికాస్ మర్మత్ మండల కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోనున్నట్లు పీడీ పేర్కొన్నారు. మండలంలోని బిటి రోడ్లు, పాఠశాలల అభివృద్ధి, అంగనాడీ కేంద్రాలు నిర్మాణం, పబ్లిక్ టాయిలెట్, ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి, తదితర వాటికి రూ.130 కోట్లు నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ మరోచోట మార్చేందుకు పరిశీలించారు. పాత ఆస్పత్రి శిథిలావస్థితికి చేరుకోవడంతో ప్రభుత్వ భవనాలను నిర్మించేందుకు, తహశీల్దార్ కార్యాలయానికి సొంత భవన నిర్మానానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. మెయిన్ రోడ్డు రహదారికి డివైడర్లు అమర్చి 50 అడుగుల వెడల్పుతో విద్యుత్ సుందరీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. పేద ప్రజల అనారోగ్యాల దృష్ట 25 పడకల ఆసుపత్రికి ప్రతిపాదనలు, 89 పెద్దూరు నుంచి అంబుర్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. విజలాపురంలో జూనియర్ కాలేజ్ నిర్మాణానికి నివేదిక పంపిస్తామని, ఈ మేరకు ప్రతిపదనలు అధికారులు సిద్ధం చేయాలన్నారు. తహశీల్దార్ కౌలేష్, ఎంపీడీవో లక్ష్మి కాంత్, టిడిపి రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, కార్యదర్శి నరసింహులు, సింగల్ విండో చైర్మన్ రఫీ పాల్గొన్నారు.

సీతమ్మ చెరువు పునర్నిర్మాణానికి అంచనాలు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఆవుల పల్లె శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయ సమీపంలో వందల సంవత్సరాల క్రితం నిర్మించిన సీతమ్మ చెరువు 2022 సంవత్సరంలో గత ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణం కోసం రెండు మొరవలు, 850 మీటర్ల పొడవున్న కట్టను తొలగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రాజెక్టు నిర్మాణాన్ని రైతుల అభ్యర్థన మేరకు నిలిపివేసి తిరిగి చెరువు నిర్మాణాన్ని చేపట్టాలని రైతులు డిమాండ్ చేయగా మంగళవారం జిల్లా కేంద్రం నుంచి ఇరిగేషన్ శాఖ అధికారులు సీతమ్మ చెరువు ప్రాంతానికి వచ్చి నిర్మాణాన్ని ఏ విధంగా చేయాలి, ఎంత ఖర్చవుతుంది, తదితర అంచనాలను వేసి నివేదికలను సిద్ధం చేసుకుని వెళ్లారు. 126 ఎకరాల విస్తీర్ణం ఉన్న సీతమ్మచెరువు పూర్తిగా నిండితే చెరువు కింద 300 నుండి 500 ఎకరాల ఆయకట్టు కింద రైతులు వ్యవసాయం చేసి పంటలు పండించుకునే అవకాశం ఉందని పలుమార్లు ముఖ్యమంత్రికి మంత్రులకు జిల్లా కలెక్టర్కు దరఖాస్తుల ఇవ్వగా నేడు అధికారులు వచ్చి పరిశీలించి అంచనాలను వేయడం జరిగింది. సీతమ్మ చెరువు ద్వారా నీటిని వాడుకుని వ్యవసాయం చేసుకునే అవకాశాన్ని కల్పించాలని రైతులు కోరుతున్నారు. ఇరిగేషన్ శాఖ చిత్తూరు ఎస్ఈ వెంకటేశుల రాజు, మదనపల్లి ఈఈ సురేష్, జెఈ శబరీష్, డిఈ రాజేంద్రప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

నేడు జాతీయ జెండాతో ర్యాలీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

అజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా 13వ తేదీ బుధవారం విద్యాశాఖ, పోలీసు, జిల్లా ప్రభుత్వ వివిధ శాఖల ఆధ్వర్యంలో జాతీయ జెండాతో ర్యాలీని ఘనంగా నిర్వహించనున్నట్లు డిఆర్ఓ కె.మోహన్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరులోని గాంధీ విగ్రహం కూడలి వద్ద నుంచి ర్యాలీని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రారంభిస్తారని, కలెక్టర్‌తోపాటు జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు, డీఈవో వరలక్ష్మీ, డీఐఈవో, డీఎస్‌డీవో, డీవైవో, మున్సిపల్ కమిషనర్, జిల్లా అధికారులు ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. ర్యాలీ అనంతరం విద్యార్థులు మానవహారం నిర్వహిస్తారని తెలిపారు. ఈ ర్యాలీలో ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు), జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ విద్యార్థులు, ఏఎన్ఎంలు, తదితర విద్యాసంస్థల నుంచి సుమారు 1000 మంది విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఎంపి మిధున్ రెడ్డి బయటికి రావాలని పూజలు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు రావాలని కోరుతూ మంగళవారం స్థానిక వైసిపి మండల అధ్యక్షులు పేట ధనుంజయరెడ్డి ఆధ్వరంలో నాయకులు నందీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎంపి మిధున్ రెడ్డిని కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని, ఆయన నిర్దోషిగా త్వరగా బయటకు వస్తారని పేర్కొన్నారు.

రోడ్లపై పార్కింగ్ చేస్తే జరిమానా: సిఐ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు:

గంగాధర నెల్లూరు మండల కేంద్రంలో రోడ్లకు ఇరువైపుల ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తే జరిమానా వేస్తామని హెచ్చరించారు. ఈసందర్భంగా మంగళవారం స్థానిక బస్టాండ్ కూడాలిలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా దుకాణదారులకు, ద్విచక్ర వాహనదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసంతి మాట్లాడుతూ ఇరుకు రోడ్లో కష్టతరమైన ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఈ కారణంగా రోడ్లపై ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తే భారీగా జరిమానా విధించి కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే దుకాణదారులు తమ దుకాణం ముందు నో పార్కింగ్ బోర్డులు పెట్టాలంటూ సూచించారు.

ఆనందప్పకు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలం తీర్థం గ్రామం దుఃఖంలో మునిగిపోయింది. గ్రామానికి గర్వకారణమైన ప్రముఖ వాయిద్య కళాకారుడు ఆనందప్ప మంగళవారం గుండెపోటుతో కన్నుమూశారు. ఈ వార్త తెలిసి గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. ఆనందప్ప పార్థివ దేహానికి వైసిపి రాష్ట్ర ఎంపీపీ సంఘం అధ్యక్షులు, ఎంపీపీ మొగసాల రెడ్డప్ప, మండల జడ్పిటిసి ఆర్.కేశవులు, మండల వైస్ ప్రెసిడెంట్ కార్తీక్, సర్పంచ్ శ్రీనివాసులు, కేశవులు పూలమాల వేసి నివాళు లర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఘనంగా ఏనుగుల దినోత్సవం




ఎలిఫెంట్ హబ్‌లో ఏనుగుల దినోత్సవం సందర్భంగా..

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు నియోజకవర్గం ముసలమడుగు ప్రాంతంలో ఉన్నటువంటి ఎలిఫెంట్ హబ్‌లో ప్రపంచ ఏనుగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏనుగులు వినాయక, జయంత్, అభిమన్య, దేవా, రంజన్, కృష్ణను ముస్తాబు చేసి వాటిని ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ కార్యక్రమానికి తిలకించడానికి విద్యార్థులు, పర్యాటక ప్రేమికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అక్కడే ఉన్న కుంకీ ఏనుగులకు కూరగాయలు, ఫ్రూట్స్ వంటివి పెట్టడానికి, సెల్ఫీలు, ఆశీర్వాదాలు అందుకోవడానికి విద్యార్థులు ఎగబడ్డారు. ఈ సందర్భంగా సబ్ డిఎఫ్ఓ వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఆరు ఏనుగులు కలిగిన ఎలిఫెంట్ హబ్ కూడా ఇదేనని, రాష్ట్రంలో ఎక్కడ ముదుపు టెనుగులు చొరబడిన ముసలిమడుగు ఎలిఫెంట్ హబ్ నుండే కుంకీలను తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఈ మధ్యకాలం చిత్తూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ముదుపుటెనుగులు అటవీ ప్రాంతాల నుండి బయటకు వచ్చి రైతన్న పంట పొలాలను ధ్వంసం చేయడం జరిగింది. ఈ ఘటన అనేక ప్రసార మాధ్యమాలు, సోషియల్ మీడియాలో బహిర్గతం కావడంతో అలర్ట్‌గా పలమనేరు పారెస్టు అధికారులు కుంకీల ఆపరేషన్ నిర్వహించారని, ఆ ఆపరేషన్ విజయవంతం అయ్యిందని, రానున్న రోజుల్లో మరింత పటిష్ఠంగా ఈ కుంకీలను పని చేస్తాయని తెలిపారు.

ఏనుగుల ప్రత్యేకత..

ప్రతి గుంపుకు నాయకత్వం వహించే పెద్ద ఏనుగు ఒకటి ఉంటుంది. ఆ గుంపు మొత్తాన్ని లీడ్ చేస్తూ ఉంటుంది. ఫీల్డ్‌లో అన్ని ఏనుగులను లీడ్ చేస్తూ ఉంటుంది. దానికి ఏ ప్రాంతంలో ఆహారం ఉంది, నీటి వసతి ఉంటుంది అన్ని వివరాలను తెలుసుకుంటుంది. తమ గుంపులోని ఏనుగులకు ఎటువంటి హాని కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటుంది. వాటి మనుగడను సాగించడానికి సురక్షితమైన ప్రాంతాలను ఎంపి చేస్తూ ఏనుగులను సంరక్షిస్తుంది. ఇలా లీడర్‌గా వ్యవహరించే ఏనుగుల జ్ఞాపకర్థంగా ఈ ఏనుగుల దినోత్సవం జరుపుకుంటున్నాం..

జెడ్‌పి సీఈవో ఆకస్మిక తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న జెడ్‌పి సీఈవో రవికుమార్

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని మంగళవారం జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. చెత్త సేకరణ, పారిశుధ్య పనుల నిర్వహణ గురించి ఎంపిడివో పురుషోత్తమను అడిగి తెలుసుకున్నారు. ఇనాం కొత్తూరు గ్రామంలో చెత్త సేకరణ పనులను పరిశీలించారు. అనంతరం కార్యాలయ సిబంది పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. కార్యాలయ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ– 2025 పనులను కేంద్ర బృందం సభ్యులు దాము, గోవింద స్వామి మంగళవారం పరిశీలించారు. మండలంలోని వెజ్జుపల్లి గ్రామంలో ఎంఎస్ టీం, స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ 2025 కార్యక్రమాలను పరిశీలించారు. ప్రధానంగా గ్రామంలో పారిశుధ్యం మురుగునీటి నిర్వహణ, తడి చెత్త – పొడి చెత్త సక్రమ నిర్వహణ, ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లను సందర్శించి కంపోస్టు తయారీ అంశాల పట్ల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, ప్రార్థనా మందిరాల వద్ద పారిశుధ్య పరిస్థితులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్, సర్పంచ్ హరి ప్రసాద్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో శివయ్య, ఎస్‌డబ్ల్యూఎం కన్సల్టెంట్ బాల సుందరం, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, ఎంఆర్‌సి మనోహర్ బాబు పాల్గొన్నారు.

తవణంపల్లిలో పొలం పిలుస్తోంది..

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని కురావుపల్లి, కుర్రపల్లి, కురపల్లి, తవణంపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి జి.ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో అధిక యూరియా వాడకం వల్ల కలుగు దుష్ప్రయోజనాలు గురించి వివరించారు. అలాగే సేంద్రీయ ఎరువులు, జీవన ఎరువుల, పచ్చిరొట్ట వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. రైతులు పురుగు మందులు, కలుపు మందులు వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అనంతరం గ్రామాల్లోని వేరుశనగ, రాగి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో పుణ్యసముద్రం ఎంపిఈఓ జ్యోతి పాల్గొన్నారు.

నూతన కమిటీకి దరఖాస్తు చేసుకోవాలి

ఆలయ కార్య నిర్వహణాధికారి మునిరాజులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని మొగిలి గ్రామంలో స్వయంభుగా వెలిసిన శ్రీ కామాక్షి సమేత మొగిలి శ్వరస్వామి ఆలయ నూతన కమిటీకి దరఖాస్తులు చేసుకోవాలని ఆలయ కార్యనిరవ్రహణాధికారి మునిరాజులు తెలిపారు. ఈనెల ఏడవ తేదీ వెలువడిన జీవో ప్రకారం దరఖాస్తులు చేసుకోవాలని 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే దానికి అవకాశం ఉందని, దరఖాస్తు ఫామ్ కావల్సిన వారు మొగిలి ఈశ్వర స్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారిని సంప్రదించి దరఖాస్తు తీసుకోవాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాన్ని చిత్తూరు హిందూ దేవదాయ శాఖ సహాయ కమిషనరకు అందించాలని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మసీదు ఆదాయంపై ఆడిట్

ప్రజాశక్తి- వెదురుకుప్పం: కార్వేటినగరం జామియా మసీద్ కమిటీ వారికి వర్క్స్ బోర్డ్ ఇన్స్పెక్టర్ గౌస్ మొహియుద్దీన్ మసీదు ఆదాయంపై ఆడిట్ నిర్వహించాలని, ఏడు రోజుల లోపల పూర్తిచేయాలని కోరారు. దీంతో జామియా మసీద్ ప్రెసిడెంట్ పి.హమీద్ ఖాన్ మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ కొంతమంది గిట్టని వాళ్లు దుష్ప్రచారం చేస్తున్నారని, మసీదు ఆదాయంలో అవకతవకలు జరుగుతున్నాయని తప్పుడు రాతలు రాశారని అన్నారు. జామియా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఎటువంటి అవకతవకలు జరగలేదని, ఆడిటింగ్ చేయాలన్న వాళ్ల సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆడిట్ చేసి వర్క్స్ బోర్డుకు అప్పగిస్తామని పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: రసాయనాలు వాడకుండా ప్రకృతిలో లభించే ఆకులతో తయారు చేసిన కషాయాలు, సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన కూరగాయలు, పండ్ల వలన సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని నగిరి డివిజన్ మాస్టర్ ట్రైనర్ రాజా ప్రతాప్ అన్నారు. మంగళవారం ఏపీసీ యన్ఎఫ్ ద్వారా పండించిన కూరగాయలను మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో స్టాల్ ఏర్పాటు చేసి విక్రయించారు. సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయల వల్ల కలిగే లాభాలను వివరించారు. మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ మునీరా, డిజిటల్ ఇన్‌చార్జి రేవతి, ఎల్ 3లు సౌందర్య, భాస్కర్ రెడ్డి, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగ సాగుపై అవగాహన

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ఖరీఫ్ వేరుశనగ విత్తనాలు విత్తిన వెంటనే డైక్లో సులాక్స్ 20 గ్రాముల 200 లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ వి.సుమతి, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త సంధ్యారాణి, వ్యవసాయ అధికారి ప్రవీణ్ అవగాహన కల్పించారు. మంగళవారం మిట్టపల్లిలో రైతులు ఆనంద నాయుడు పొలంలో వేరుశనగ పంటకు డైక్లో సులాక్స్ పిచికారి చేసి చూపించారు. అనంతరం వారుమా మాట్లాడుతూ డైక్లో సులాక్స్ పిచికారి చేయటం వలన కలుపు సమర్థవంతంగా అరికట్టడం వలన ఎకరాకు దాదాపు 20 మంది కూలీల ఖర్చు తగ్గించుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు సోమల విద్యార్థులు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ పోటీలకు ఎన్నికయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎంపికల్లో భాగంగా మదనపల్లిలో ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఈనెల 10వ తేదీన నిర్వహించారు. ఈ రోప్ స్కిప్పింగ్ ఎంపిక పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోమలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థులు షేక్ మహమ్మద్ రియాన్, సత్తెనపల్లి రఘునందన్, షేక్ హుజేఫ్ అత్యంత ప్రతిభ కనబరచి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు హేమసుధాకర్ తెలిపారు. ఈ విద్యార్థులు రోప్ స్కిప్పింగ్ పోటీల్లో అండర్ –14 విభాగంలో స్పెక్టింగ్ స్టైల్, ఎండోరెన్స్, డబుల్ అండర్, గ్రూప్ ఈవెంట్ విభాగంలో ఎంపికయ్యారని, రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు కర్నూల్ జిల్లాలోని కర్నూల్ పట్టణంలో ఆగస్టు 30వ తేదీ రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు జరుగుతాయని పీడీ కరుణానిధి తెలిపారు. ఇదివరకే ఈ విద్యార్థులు స్కూల్ గేమ్స్ పోటీలకు, అసోసియేషన్ పోటీలకు కూడా ఎంపికయ్యారని మళ్లీ అసోసియేషన్ విభాగంలో కూడా ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం

కమిటీ ఛైర్మన్, మెంబర్లకు సన్మానం



ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండల సింగిల్ సొసైటీ విండో త్రిమెన్ కమిటీ అధ్యక్షుడు మోహన్ నాయుడు, సభ్యులైన జ్యోతి యాదవ్, ఇమ్మానువేలు (చిన్న)ను మంగళవారం సొసైటీ కార్యాలయ సిబ్బంది శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఈవో విజయ్ కుమార్ రెడ్డి, డిసిసి బ్యాంక్ మేనేజర్ గోమతి, సింగల్ విండో స్టాఫ్ అసిస్టెంట్ మునస్వామి, హరిబాబు తదితరులు ఉన్నారు.

చినుకుపడితే.. కునుకుపట్టదాయే..

భయం..భయంగా..


నీవానది పరివాహక ప్రజలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చినుకుపడితే నీవానది పరివాహక ప్రజలకు కునుకుపట్టదు.. వర్షం తగ్గుముఖం పట్టేంత వరకు భయం గుప్పెట్లో గడపాల్సిన దుస్థితి. నాటి 2020 నవంబర్ మాసంలో ముంచెత్తిన వరద నష్టం కళ్ళముందు కనిపిస్తుంది. ఏండ్లు గడుస్తున్నా నీవానది వాసుల చింత తీరండం లేదనే చెప్పాలి. 2020లో ముంచెత్తిన వర్షంతో చిత్తూరు నగరం వీదుగా ప్రవహిస్తున్న నీవానదికి ఎన్నడూ లేన్నట్లు వరద ముంపు నీవానది పరివాహక ప్రాంతాలైన తేనబండ, వీరభద్రకాలనీ, కైలాసపురం, రీక్షా కాలనీలను ముంచెత్తింది. తట్టాబుట్ట సర్దుకొని కట్టుబట్టలతో 20 రోజులకు పైగా అంటే వరద ఉధృతి తగ్గేంత వరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునవాస కేంద్రాల్లో 300 మంది పిల్లజల్లాతో ఉండాల్సి వచ్చింది.

ఈ ప్రాంత వాసులను కదలిస్తే నేటికి నాటి వారి దుస్థితిని గుర్తు చేసుకుంటూ కంటతడి పెట్టుకుంటున్నారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలతో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ఈ ప్రాంతవాసులు వణికిపోతున్నారు. ఏ అర్ధరాత్రో అపరాత్రో నీవానది ఉపొంగి ముంచెత్తితో తమ పరిస్థితి ఎలా అని వర్షం పడ్డ రాత్రి నిద్రలేకుండా గడుపుతున్నారు. పాలకులు మారినా తమ తలరాతలు మారడం లేదని ఇక్కడి పేదలు వాపోతున్నారు. చిత్తూరు నగరం నడిబొడ్డున ఏడు కిలో మీటర్లు పొడవైన నీవానది పరివాహక ప్రాంతాల్లో ఆటో, రిక్ష, భవన నిర్మాణ కార్మికులు, రజకులు (దోబీలు) 40 ఏండ్లకు పైగా ఆవాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. వరద ముంచెత్తిన సమయంలో నానా హడావిడి చేసే రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు వరద తగ్గుముఖం పట్టాక పట్టించుకోకవడంతో అధిక వర్షాల సమయంలో వీరి పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంటోంది.

కాంక్రీట్ వాల్ ఎప్పటికో...

నీవానది వరద ముంపు నుండీ ప్రజలను కాపాడేందుకు కాంక్రీట్ వాల్ నిర్మాణం చేపట్టాలంటూ స్థానిక ఎంఎల్ఏ అసెంబ్లీలో చర్చించి ఏడు కిలో మీటర్ల పరిధిలో ఉన్న నీవానదికి కాంక్రీట్‌వాల్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చి ఏడాకి పైగా గడుస్తోంది. నీటి పారుదలశాఖ అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. రూ.6 కోట్లు అంచనా వేశారు. ఆరు నెలల క్రితం జేసిబిల ద్వారా నీవానది వ్యర్థాలను తొలగించారు. నీటి ప్రవహానికి అడ్డులేకుండా చేయడం ద్వారా వరద ముప్పు తొలగుతుందని చెబుతున్నా.. కాంక్రీట్ వాల్ నిర్మాణం జరిపితే వరద ముంపు నుండీ నీవానది పరివాహక కుటుంబాలకు రక్షణ కల్పించవచ్చని ఇక్కడి ప్రజలు భావిస్తున్నారు. అసెంబ్లీ చర్చ, కాంక్రీట్‌వాల్ నిర్మాణం కోసం నీటిపారుదశాఖ అధికారుల అంచనా వేసి ఏడాది గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడం పట్ల ఇక్కడి ప్రజలు వర్షాకాలంలో భయం.. భయంగా.. గడపాల్సి వస్తోంది. ఇప్పటికైనా నీవానది పరివాహక ప్రజల రక్షణ కోసం కాంక్రీట్‌వాల్ నిర్మించాలని వీరభద్రకాలనీ, కైలాసపురం, తేనబండ, రిక్షా కాలనీ వాసులు కోరుతున్నారు. నీవానది పరివాహక ప్రజల కోరిక ఎన్నటికి నేరవేరుతుందో వేచిచూడాలి.

2020 నవంబర్ నాటి నీవానది వరద దృశ్యాలు (ఫైల్ ఫొటోలు)

డిగ్రీ కోర్సుల ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని ద్రావిడ విశ్వవిద్యాలయంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి డిగ్రీ కోర్సులలో ప్రవేశానికి గాను అడ్మిషన్స్ జరుగుతున్నాయని అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య కె.శ్యామల మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓ.ఏ.ఎం.డీ.సీ -2025 పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 10వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చున అని తెలిపారు. విశ్వవిద్యాలయంలో బి.ఏ. (ఆనర్స్) పొలిటికల్ సైన్స్, బి.ఏ. హిస్టరీ, బి.ఏ. సోషియాలజీ, బి.ఏ. స్పెషల్ తెలుగు, బి.ఏ. స్పెషల్ ఇంగ్లీష్, బి.కాం. కంప్యూటర్ అప్లికేషన్స్, బి.కాం. జనరల్, బి.కాం. డిజిటల్ మార్కెటింగ్, బి.బి.ఏ., బి.ఎస్సి. కంప్యూటర్ సైన్స్, బి.ఎస్సి. డేటా సైన్స్, బి.ఎస్సి. మేథమేటిక్స్, బి.ఎస్సి. బయోటెక్నాలజి, బి.ఎస్సి. కెమిస్ట్రీ, బి.ఎస్సి. బాటనీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల అర్హులైన విద్యార్థులు ద్రావిడ విశ్వవిద్యాలయానికి వచ్చి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవలసినదిగా తెలిపారు. విశ్వవిద్యాలయంలోని అత్యాధునిక సదుపాయాలు, హాస్టల్ వసతి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనుభవం కలిగిన అధ్యాపకుల ఆధ్వర్యంలో ఈ కోర్సులను అభ్యసించవలసినినదిగా కోరారు. అలాగే ద్రావిడ విశ్వవిద్యాలయంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అర్హులైన విద్యార్థులు వివిధ యుజీ, పీజీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవలసినదిగా కోరారు. సమాచారం కొరకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను సందర్శించవలసినదిగా సూచించారు.

20న పూతలపట్టులో జాబ్‌మేళా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 20వ తేదీ పూతపట్టులోని పేటమిట్ట అమరాజ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో బహుళ కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. 18 నుండి 33 సంవత్సరాల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఇంటర్, ఐటిఐ డిప్లొమా, డిగ్రీ, బిటెక్, ఎంబిఏ పూర్తి చేసిన జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు. నెలకు రూ.13వేల నుండి 41వేల వరకు అందే అవకాశమున్నట్లు తెలిపారు. వివరాల కోసం 85200 48041, 99635 61755 నంబర్లను సంప్రదించాలన్నారు.

రేపు మండల సర్వసభ సమావేశం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఈనెల 14వ తేదీ మండల సర్వసభ సమావేశం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు మండల అభివృద్ధి కార్యాలయంలో మండల సర్వసభ సమావేశం జరుగుతుందని, మండల అధికారులు గత సమావేశంలో ఇచ్చిన నివేదికలను, వాటి పరిష్కార నివేదికలను తయారు చేసి తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశానికి జడ్పిటిసి, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల శాఖ అధికారులు హాజరు కావాలన్నారు.

సంక్షేమ పథకాలలో రాజకీయ జోక్యం వద్దు



ప్రజాశక్తి - వాకాడు : తిరుపతి జిల్లా, వాకాడు మండలం, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని స్త్రీ శక్తి భవనంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పనులలో పంచాయతీ తీర్మానం లేకుండా పనులు నిర్వహిస్తున్నారని ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని సర్పంచులు కోరారు. ముఖ్యంగా విద్య, వైద్య, నీటి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ సహాయకులు కొడవలూరు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల లబ్ధి కోసం ఏర్పడ్డ పొదుపు, ఉపాధి హామీ పథకాలలో రాజకీయ నాయకుల జోక్యం చేసుకోవద్దని, అధికారులు తమ విధులు న్యాయబద్ధంగా చేయాలని సూచించారు. సర్వసభ్య సమావేశానికి అధికారులు అందరూ హాజరు కావడం లేదని తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించడం లేదని దామోదర్ రెడ్డి తెలిపారు. మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ సభ్యులు వివరించిన సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తమ పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పవన్‌ని ఆదుకుంటాం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఫైనాన్సర్ల దాడిలో గాయపడిన పవన్‌ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎస్సీ కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్ తెలిపారు. దాడిలో గాయపడి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పవన్ మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతూ.. 25 మంది చుట్టుముట్టి దాడి చేశారని, అందులో 16 మందిని పేర్లతో సహా గుర్తించామని పవన్ తెలిపాడన్నారు. గుర్తించిన వారిపై కేసులు నమోదు చేశారని తెలిపారు. పవన్‌కు ప్రభుత్వం అట్రాసిటీ తరఫున రావాల్సిన రాయితీలు అందేలా చూస్తామన్నారు. దాడి చేసిన వారు ఎంతటి వారైనా చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరిని ఉపేక్షించేది లేదని తెలిపారు. ఈ ప్రభుత్వం ఏర్పడ్డ దళితులకు అండగా ఉంటామని ఎస్సీ కమిషన్ ఛైర్మన్ గా నన్ను నియమించారని, ఆ పదవికి న్యాయం చేసే విధంగా బాధ్యతలు నిర్వర్తిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, మాజీ ఎం.ఎల్.ఎ లు పరసారత్నం, సూరజ్, శ్రీధర్ వర్మ, దళిత సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆకుల కుబేరుమడికి టిడిపి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - నాయుడుపేట: పట్టణంలోని ప్రముఖ వ్యాపార వేత్త టీడీపీ సీనియర్ నాయకులు ఆకుల కుబేర మణిని టిడిపి నాయకులు ఆయన నివాసంలో మంగళవారం పరామర్శించారు. తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణానికి చెందిన టిడిపి నాయకులు ఆకుల కుబేరమణి గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో నెల్లూరు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం కుదుటపడి ఆయన గత రెండు రోజుల క్రితం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి నాయుడుపేట లోని తన నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయనను టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణ రెడ్డి, టిడిపి నాయకులతో కలిసి ఆయన నివాసానికి చేరుకుని ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుబేరమణి త్వరగా కోలుకోవాలని ఆయన తిరిగి యథావిధిగా వ్యాపార కార్యక్రమాలతో పాటు పార్టీ కార్యక్రమాలలో పాల్గొనాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో టీడీపీ నేతలు మదిరి చిట్టిబాబు, నెస్యపూరి బాను, వెంకటేశ్వర్లు, షేక్ రఫీ, తదితరులు ఉన్నారు.

విదేశీ విద్యా పథకాన్ని ప్రారంభించాలి



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, పద్మావతి గెస్ట్ హౌస్‌లో విదేశీ విద్యా పథకాన్ని త్వరలో ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్‌కు, నేషనల్ లా స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నేషనల్ లా స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సుందర రాజు మాట్లాడుతూ గత కొంతకాలంగా విదేశీ విద్య పథకం రాష్ట్ర స్థాయిలో అమలు కాకపోవడం వల్ల అనేక మంది ఎస్సీ, ఎస్టీ, విద్యార్థుల విదేశీ విద్యా అవకాశాలను కోల్పోతున్నారని. ఈ పథకాన్ని తక్షణమే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎల్.ఎస్.ఏ జిల్లా అధ్యక్షులు ప్రకాష్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

55వ రోజూ నిరసన దీక్షలు



ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: రామారావుని బదిలీ చేయాలని, అతనిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం నాటికి 55వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ గత పది సంవత్సరములుగా నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వర్తిస్తున్న రామారావుని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. రామారావుపై చర్యలు తీసుకునే వరకు సిఐటియు ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచలయ్య సుబ్రహ్మణ్యం సుబ్బయ్య కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం సాయంకాలం సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాథ నాయుడు ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటించకుండా ఎక్కడపడితే అక్కడ రోడ్డుపై ఆటోలు ఆపరాదని సూచించారు. బస్టాండ్ ఆటోలు, ఇతర వాహనాలు నిలిపి ఉండడం వలన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎవరైనా రోడ్లమీద తాగి గొడవలు చేసే వారిపైన చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రభాకర, సురేష్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమస్యలపై నేషనల్ మజ్దూర్ యూనియన్ ధర్నా

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, సిబ్బంది హక్కుల కోసం గళమెత్తిన ఉద్యోగులు



ప్రజాశక్తి - పుత్తూరుటౌన్: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుత్తూరు ఆర్టీసీ డిపోలో మంగళవారం ధర్నా చేశారు. రెండు రోజులపాటు కొనసాగే ఈ కార్యక్రమంలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, సిబ్బంది డిమాండ్ల పరిష్కారం కోసం యూనియన్ నినాదాలు నాయకులు చేశారు. కడప జోనల్ వైస్ ప్రెసిడెంట్ కె. అర్ముగం అధ్యక్షతన, తిరుపతి జిల్లా అధ్యక్షులు ఎస్. జె. పెరుమాళ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉద్యోగులకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. విజయవాడ సెంట్రల్ కమిటీ వారు ఈ నెల 3న నిర్వహించిన సమావేశంలో నిర్ణయించిన డిమాండ్లలో గవర్నర్‌పేట 1, 2 డిపోల 4.5 ఎకరాల ఆర్టీసీ భూమిని లూలు అనే ప్రైవేట్ సంస్థకు ఇవ్వడాన్ని వెంటనే రద్దు చేయాలని, విద్యుత్ బస్సులను ప్రైవేటు నిర్వహణకు అప్పగించకుండా ఆర్టీసీ ద్వారానే నడపాలని,10 నెలలుగా పెండింగ్‌లో ఉన్న సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రమోషన్లు, 12 ఏళ్ల ఇంక్రిమెంట్, పెండింగ్‌లో ఉన్న డిఏ, పిఆర్‌సి, లీవ్ ఎంకాష్‌మెంట్ లను తక్షణమే చెల్లించాలని రిటైర్డ్, మరణించిన ఉద్యోగుల గ్రాచ్యుటీ, సెటిల్మెంట్లను ఆలస్యం చేయకుండా అమలు చేయాలని డిమాండ్ చేయడం జరిగిందన్నారు. ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే ఉచిత బస్సు సేవల కారణంగా సిబ్బందికి కలిగే ఇబ్బందులను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు డిపో అధ్యక్షులు ఎస్. సుందరం, కార్యదర్శి శివకుమార్, సి.సి.ఎస్. డెలిగేట్ ఎస్. ధనరాజ్, జాయింట్ సెక్రటరీలు కె. రమేష్ బాబు, ఎం. వినోద్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ కె. మనోహర్, అసిస్టెంట్ సెక్రటరీ ఈ. నాగరాజు, గ్యారేజ్ అధ్యక్షులు రమేష్, సెక్రటరీ దొరబాబు, వైస్ ప్రెసిడెంట్ వాసు తదితరులు పాల్గొనగా ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై డిమాండ్ల సాధన వరకు పోరాటం కొనసాగుతుందన్న సంకల్పాన్ని వ్యక్తం చేశారు

కూటమి అధికారం వెనుక బిజెపినే కీలకం

- నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాం
- సార్ధ్య పర్యటనలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్



ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో : రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడం వెనుక బిజెపి కీలకమని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ అన్నారు. రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరి కృషిని అందరినీ కలుపుకొని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సారధ్య పర్యటనలో భాగంగా తిరుపతికి చేరుకున్న మాధవ్‌కు జిల్లా బిజెపి నాయకత్వం పెద్ద ఎత్తున స్వాగత ఏర్పాట్లు చేసింది. లీలామహల్ కూడలి నుంచి ర్యాలీగా కచ్చప్పి ఆడిటోరియంకు చేరుకొని మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎన్నో నిధులు విడుదల చేసిందని, గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు పొంది చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రారంభోత్సవం శిలాఫలకాలలో ఎక్కడా కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత కనబరచకుండా ఏర్పాటు చేయడం శోచనీయమన్నారు.

గతంలో ఉన్న విధానాన్ని మార్పు చేశాం..

కూటమి పార్టీలుగా ఏర్పడి తెలుగుదేశం, జనసేన పార్టీలకు మద్దతు పలికిన భారతీయ జనతా పార్టీకి ప్రాధాన్యతలో భాగంగా సీట్ల కేటాయింపులో వారిచ్చిందే మనం తీసుకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు నామినేటెడ్ పదవుల్లో తప్పనిసరిగా బిజెపికి సంబంధించిన వారికి తగిన ప్రాధాన్యత ఇచ్చేలా నిర్ణయం తీసుకొని అమల్లోకి తీసుకొచ్చామన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రపంచస్థాయి గుర్తింపు సాధించిందని, వికసిత్ భారత వైపు అడుగులు వేస్తోందన్నారు.

కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఇస్తాం..

బిజెపిలో కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత పదవులను ఇవ్వడం స్పష్టంగా జరుగుతుందని, మరి ఇతర పార్టీల్లో ఈ విధానం సరిగ్గా అమలు కాదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడడానికి క్షేత్రస్థాయి నుండి మండల స్థాయి, జిల్లా స్థాయిలో కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు కోలా ఆనంద్, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు



ప్రజాశక్తి శ్రీకాళహస్తి: ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ వేడుకలు మంగళవారం పట్టణ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఆ సంఘం పథకాన్ని ఆవిష్కరించి ఆవిర్భావ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థి సంస్థలపై అలుపెరగని పోరాటం చేస్తున్న ఏకైక సంఘం ఏఐఎస్ఎఫ్ అని జిల్లా సహాయ కార్యదర్శి కోగిల. మునిచందు తెలిపారు. ప్రాథమిక విద్యను నిర్వీ ర్యం చేసేలా ఉన్న జీవోలు 77, 107, 108 లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చైతు, ముఖేష్, ఆసిఫ్, రవి తదితరులు పాల్గొన్నారు.

యువత నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : దేశంలోని యువత నైపుణ్యాభివృద్ధి, సృజనాత్మకత ఆలోచనలపై దృష్టి సారించి నూతన విషయాలను ఆవిష్కరించడంలో పాలు పంచుకోవాలని ఎస్వీయూ ఇన్చార్జి విసి ఆచార్య సిహెచ్ అప్పారావు పిలుపునిచ్చారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విద్యార్థుల కల్చరల్ విభాగం ఆధ్వర్యంలో సెనేట్ హాల్లో మంగళవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దేశజనాభాలో సగభాగానికి పైగా యువత నైపుణ్యాభివృద్ధి, సృజనాత్మకత అనే అంశాలపై శ్రద్ధ వహించాలని పాశ్చాత్య దేశాల సంస్కృతిని వీడనాడి, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహనని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎమ్. భూపతినాయుడు మాట్లాడుతూ నేటి యువతే దేశ సంపదని, వారి శక్తి సామర్థ్యాల మీద దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని అన్నారు. జిల్లా యువజనుల సర్వసుల శాఖ కార్య నిర్వాహణ అధికారం కే. మోహన్ కుమార్, ఆచార్య బివి. మురళీధర్ మాట్లాడుతూ యువత దృష్టి అభివృద్ధివైపు ఉండాలని, మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా, సాంస్కృతిక కార్యక్రమాలు, కళల వైపు దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమం అనంతరం వివిధ అంశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. వకృత్వం, నాటిక, జాతీయగీతాలు, పెయింటింగ్, వివిధ అంశాలలో పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సాయంకాలం జరిగిన కార్యక్రమంలో ఆచార్య కె. సుధారాణి, ఆచార్య సురేంద్ర బాబు చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ అంతర్జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమం కల్చరల్ కోఆర్డినేటర్ డా. పత్తిపాటి వివేక నేతృత్వంలో జరిగింది. ఈ కార్యక్రమంలో డా. కళ్యాణ్ కుమార్, శరత్ బాబు, 30" ఉదయ్ భాస్కర్, రాజశేఖర్ తదితరులు, 16 కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్పిటల్లో వైద్యానికే 108లో తీసుకెళ్తాం

ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లనని గర్భిణిని నడిరోడ్డుపై వదిలేసిన సిబ్బంది

ప్రజాశక్తి - రామచంద్రపురం: ప్రవేటు ఆసుపత్రిలో కాన్పు చేయించుకుంటామని తెలిపిన గర్భిణీ, ఆమె తరపు బంధువులను 108 సిబ్బంది నడి రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయారు. వివరాల్లోకి వెళితే రామచంద్రపురం మండలం, గోకులాపురం గ్రామానికి చెందిన ఎదల శ్రీదేవి ప్రసవ నొప్పులు మొదలవగా, భర్త భాస్కర్ రెడ్డి 108 కు ఫోన్ చేశారు. 108 వాహన సిబ్బందికి లొకేషన్ ట్రేస్ అవుట్ కాక, ఆలస్యంగా గ్రామానికి చేరుకుంది. గర్భిణి శ్రీదేవిని, కుటుంబ సభ్యులను వాహనంలో ఎక్కించుకుని కొంత దూరం వచ్చారు. ఏ హాస్పిటల్లో దింపాలని 108 సిబ్బంది, గర్భిణీ కుటుంబ సభ్యులను అడుగగా ప్రైవేటు వైద్యశాలకు తరలించమని చెప్పడంతో108 సిబ్బంది ప్రైవేటు హాస్పిటల్‌కు 108 వాహనంలో తరలించడానికి వీలుకాదని చెప్పారు. దీంతో గర్భిణీ కుటుంబ సభ్యులకు, 108 సిబ్బంది మధ్య వాగ్వివాదం జరిగింది. ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలకైతే తీసుకెళ్తాం, ప్రైవేటు వైద్యశాలకు అయితే దిగేయండని నడిరోడ్లో దింపేశారు. దీంతో దిక్కుతోచని స్థితిలో భర్త భాస్కర్ రెడ్డి తన ద్విచక్ర వాహనంలో గర్భిణీ శ్రీదేవిని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు.

వ్యవసాయ సహకార సంఘం నూతన అధ్యక్షులు ఎంపిక

ప్రజాశక్తి - తడ : తడ మండలం, తడ ప్రాథమిక వ్యసాయ సహకార సంఘం సొసైటీ అధ్యక్షులుగా శ్రీకాంత్ రెడ్డిని ఎంపిక చేసారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సూళ్లూరుపేట శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ, సూళ్లూరుపేట తెలుగుదేశం ఇంచార్జి పెద్దలు నెలవల సుబ్రహ్మణ్యం భాద్యత కూడా పెంచారని, తడ మండలం సొసైటీ అధ్యక్షుల కర్తవ్యం నిస్వార్థంగా నిర్వహిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం, కొండేపాటి గంగాప్రసాద్, జిల్లా తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి, తడ మండలం తెలుగుదేశం అధ్యక్షులు కామ్మిరెడ్డి మురళి రెడ్డి, క్లస్టర్ ఇంచార్జిలకు తడ మండలం తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలకు తెలిపారు.

ఎస్వీ మ్యూజియం అభివృద్ధి పనులపై అదనపు ఈవో సమీక్ష

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల ఎస్వీ మ్యూజియం అభివృద్ధి పనుల పురోగతిపై టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తిరుమలలోని అన్నమయ్య భవన్ లో మంగళవారం సాయంత్రం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్, ఎలక్ట్రికల్, ఇంజినీరింగ్ పనులు, మ్యూజియం గైడ్స్, భద్రత, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలను ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్ది ప్రపంచ స్థాయి ఆధునిక మ్యూజియంగా అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. పనులను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్ ఛార్జ్ చీఫ్ మ్యూజియం ఆఫీసర్ సోమన్నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ దినోత్సవం

ప్రజాశక్తి యంత్రాంగం: – తొట్టంబేడు మండలం, కాసరం, తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలలోని విద్యార్థులకు నులి పురుగుల నివారణకు ఉపయోగించే ఆల్ బె డజోల్ 400 మిల్లి గ్రాముల మాత్రలను విద్యార్థులకు అందజేయడం జరిగిందని వైద్యులు తెలిపారు.

- పుత్తూరు మండల పరిధిలోని, గొల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణాధికారి మార్టిన్ లూథర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మంగళవారం నులి పురుగుల మందు వేయించారు.
- గూడూరు, ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా ప్రభుత్వ వైద్యశాల హెల్త్ అసిస్టెంట్లు విద్యార్థిని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.
- బుచ్చినాయుడు కండ్రిగ మండల పరిధిలోని అంగన్వాడి కేంద్రాల్లో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల్లో, జూనియర్ కాలేజీల విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా ఆల్బెండజోల్ టాబ్లెట్ మింగించారు.
- పిచ్చాటూరు ఎంఈఓ హేమమాలిని ఆధ్వర్యంలో మంగళవారం నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేయడం జరిగింది.
- కేవీబి పురం డాక్టర్ రామ్ నాయక్ ఆధ్వర్యంలో నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పలువురు విద్యార్థులకు ఆయన ఆల్బెండజోల్ మాత్రలను పంపీణీ చేశారు.
- విజయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నులి పురుగులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మింగించారు.
- ఎస్ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ శమమ రెహమాన్, ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బాలాజీ చరణ్‌ల ఆధ్వర్యంలో ఎస్ఆర్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, గంగమ్మ గుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు.
- రొంపిచర్ల మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జాతీయ నులిపుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, కాలేజీల్లో నులిపురుగుల మాత్రలు విద్యార్థులకు అందించారు.
- గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు ఆల్బెండజోలు మాత్రలు గంగవరం వైద్యాధికారి డాక్టర్ లహరి, వారి సిబ్బందిచే మధ్యాహ్నం భోజనం తర్వాత మింగించారు.
- ఐరాల పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ రెడ్డప్ప ఆధ్వర్యంలో పొలకల హైస్కూల్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందించారు.
- గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని మండల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఆంజనేయులు శెట్టి గుణశేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులకు నులిపురుగుల మందులు పంపిణీ చేశారు.
- చిత్తూరు నగర పరిధిలోని గిరింపేట మునిసిపల్ హైస్కూల్‌లో జాతీయ నులిపురుగుల దినోత్సవ కార్యక్రమాన్ని చీఫ్ గెస్ట్ నగర పాలక మేయర్ కుమారి ఆముద లాంచనంగా ప్రారంభించారు. అంగన్వాడి, ప్రాథమిక పాఠశాలలు, హై స్కూల్స్, కాలేజెస్ వరకు అందరు నులిపురుగులు లేని సమాజ స్థాపనకు కృషి చేయాలని తెలిపారు.
- సోమల మండలంలో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు.
- బైరెడ్డిపల్లి తీర్థం పిహెచ్‌సీ పరిధిలోని 18 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలలో 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల 3968 మంది పిల్లల్లో 97 శాతం మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేసి నులిపురుగుల నివారణ చర్యలు చేపట్టారు.
- కార్వేటి నగరం మండలం, కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న 15 సచివాలయాలలో ప్రాథమిక పాఠశాలలు, హై స్కూల్స్, అంగన్వాడి స్కూల్స్, గవర్నమెంట్ ఐటిఐ లలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు.





రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

ప్రజాశక్తి -కోట : రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిదని, ధ్రుతరాష్ట్రుని పాలన కొనసాగుతుందని వైఎస్ఆర్సిపి ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌విఎస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పిటిసి స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో అప్రజాస్వామికంగా ఎన్నికలు నిర్వహించారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అధికారులు, పోలీసులు అధికార పార్టీకి కొమ్ము కాస్తూ వారికి ఏజెంట్లు లాగా పని చేశారని ఎద్దేవా చేశారు. పోలింగ్ బూత్‌లను ఒక ప్రాంతం నుంచి ఇంకొక ప్రాంతానికి తరలించి ఓటర్లను అయోమయానికి గురిచేసి, గందరగోళం సృష్టించారన్నారు. ఇతర ప్రాంతాల నుంచి టిడిపి నాయకులను, రౌడీలను, గుండాలను ఇక్కడికి తీసుకువచ్చి ఓటర్లను ఓట్లు వేయకుండా అడ్డుకన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు రిగ్గింగ్‌కి పాల్పడ్డారని, ఎన్నికల అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. దాడులను ప్రశ్నించిన ఎంపీ అవినాష్ రెడ్డిని, వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డిని ఇతర వైయస్సార్సీపి నాయకులను అరెస్టు చేయడం దారుణమన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ప్రజలకు సేవలు అందిస్తున్నానని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కల్‌రోడ్డుపల్లి, కొంగరవారిపల్లి, గ్రామపంచాయతీలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తామన్నారు. స్థానికులు రేషన్ కార్డులు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, ఇంటి పట్టాలు, భూసమస్యలు, వాటర్ ట్యాంక్, డ్రైనేజ్ సమస్యలను ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివరాం సుబ్బయ్య, ఎంపీడీవో వెంకటరత్నం నాయుడు, ఎస్సై అనిత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ గౌస్ బాషా, సిడిఎంఎస్ చైర్మన్ పి సుబ్రహ్మణ్యం నాయుడు, లంకెల్ల లలిత, కనుమూరి చెంచయ్య నాయుడు, లోకాద్రి నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు ఏ బాలకృష్ణ, స్థానిక టిడిపి నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండండి

ప్రజాశక్తి - క్యాంపస్ : ర్యాగింగ్‌కు దూరంగా ఉండండి.. జీవితాన్ని సద్వినియోగం చేసుకోండని విద్యార్థినిలకు ఆచార్య సీతాకుమారి పిలుపునిచ్చారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వి.ఉమ సూచనల మేరకు ఇవాళ నేషనల్ యాంటీ ర్యాగింగ్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ అఫైర్స్, డైరెక్టర్ ప్రొఫెసర్ కె. ఉషారాణి, వార్డెన్ ప్రొఫెసర్ జి.సావిత్రి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఐవీ.లలిత కుమారి, డైరెక్టర్, ఇంజనీరింగ్ కాలేజ్ ప్రొఫెసర్ టి.మల్లికార్జునరావు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ విద్యార్థిని భార్గవి యుఎస్ఎ పర్యటన

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని మహిళా వర్సిటీలో న్యాయ విద్యార్థిని భార్గవి నుకతోటి, యుఎస్ఎలో ఐదు వారాల జాన్ మెక్‌కెయిన్ స్టడీ ఆఫ్ యునైటెడ్ స్టేట్స్ ఇన్‌స్టిట్యూట్స్ కార్యక్రమంలో పాల్గొని విభిన్న న్యాయ వ్యవస్థలు, నాయకత్వ శైలులు, సుపరిపాలన, సంస్కృతులను ఆమె బహిర్గతం చేయడం ద్వారా ప్రపంచ పౌరసత్వం బలమైన భావాన్ని అభివృద్ధి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భారతదేశం, దక్షిణ కొరియా, శ్రీలంక, మలేషియా, బోస్నియా మరియు హెర్జెగోవినా, జాంబియా మరియు కజకిస్తాన్ నుండి 19 మంది పాల్గొన్నారు. తనను ఎంపిక చేసి, మార్గదర్శకత్వం వహించినందుకు పబ్లిక్ డిప్లొమసీ ఆఫీసర్ ఎమిలియా స్మిత్, హైదరాబాద్‌లోని కాన్సులేట్ జనరల్ నుండి పబ్లిక్ ఎంగేజ్‌మెంట్ స్పెషలిస్ట్ సెంథిల్ కుమార్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.ఉమ ఆమెను అభినందించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని, డీన్ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ ప్రొఫెసర్ విజయ లక్ష్మి, అసోసియేట్ డీన్ మద్దతు ఇచ్చినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. న్యాయ విభాగం హెడ్, ఫ్యాకల్టీ సభ్యుల ప్రోత్సాహానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం పోరు సాగించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : అఖిల భారత విద్యార్థి సమాఖ్య 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు తిరుపతి నగరంలో వివిధ సంక్షేమ హాస్టల్, ఎస్వీయూలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి జెండా ఆవిష్కరణ చేసిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చలపతి, తిరుపతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్ కుమార్, సి.ప్రవీణ్ కుమార్‌లు మాట్లాడుతూ విద్యార్థుల హక్కులు కాలరాస్తున్న జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లోకి విద్యార్థి నాయకులు రాజకీయ పార్టీలు అనుమతులేదని తీసుకువచ్చిన జీవోలు ఎవరికోసం ఎవరి లబ్ది కోసమని ప్రశ్నించారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ సమరశీల పోరాటాలు రాబోయే కాలంలో నిర్వహించేందుకు సిద్ధం కావాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ మోహన్, వినయ్ నగర నాయకులు అశోక్, పవన్, విష్ణు, గణేష్, మహేష్‌లు పాల్గొన్నారు.

చేతి వృత్తులకు చంద్రబాబు చేయూత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: చేతి వృత్తుల వారికి చంద్రబాబు చేయూత అందిస్తున్నారని టీడీపీ నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు నాయకుడు కోట చంద్రశేఖర్ పేర్కొన్నారు. చేతి వృత్తులపై ఆధారపడి జీవించే వారు సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు అవసరమైన ఆర్థిక భరోసా కల్పిస్తున్న ఎన్డీయే కూటమి పెద్దలు నరేంద్ర మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ బాబు, సుధీర్ రెడ్డి చిత్రపటాలకు మంగళవారం స్థానిక పూసల వీధి కూడలిలో టీడీపీ బిసి విభాగం నాయకులు పాలాభిషేకం చేశారు. ఉమేష్ రావు, మిన్నల్ రావు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఏపీ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాజు కోరారు. తిరుపతిలో వైసిపి నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడిన దళిత యువకుడు పవన్ కుమార్‌ను పరామర్శిం చేందుకు మంగళవారం తిరుపతికి వచ్చిన, ఏపీ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌కు తిరుపతి పద్మావతి అతిథి గృహం వద్ద సి.శివరాజు బృందం ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేకంగా జిల్లాలో దళితుల సమస్యలపై చర్చించారు. గత వైసీపీ పాలనలో ఇలాంటి అనేక దాడులు, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో దళితులపై జరిగాయని శివరాజు వివరించారు. తిరుపతిలోని వివిధ యూనివర్శిటీలు, మున్సిపల్ కార్పొరేషన్, రెవిన్యూ సమస్యలను ఆయన కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. దళితుల పట్ల వివక్షత, పదోన్నతులు, దాడులు, ఆస్తులు ధ్వంసం వంటి అనేక సమస్యలను ఎస్సీ కమిషన్ కమీషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. దళితుల భూములను అగ్రవర్ణాలు ఆక్రమించుకున్న పలు సంఘటనలను ఆయన కమిషన్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకుడు భాస్కర్, బాలరాజు, మణికంఠరెడ్డి, కందన్, రమేష్, వెలుమూరుగన్, విశ్వనాథ, పెద్ద వెంకటేష్, గజంద్ర, జాయల్, చిన్నారాజు, కార్తీక్, రాఘవేంద్ర, శివకుమార్, బాలాక్రిష్ణ, విజయ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గొడుగులు వితరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి తమిళనాడు రాష్ట్రానికి చెందిన శ్రీమత్ రామానుజ కైంకర్యం ట్రస్టు తిరువనంతపూర్ వారు మంగళవారం రెండు గొడుగులను వితరణగా అందజేశారు. రానున్న మహాశివరాత్రికి ముక్కంటి ఆలయ అధికారులు డిజైన్ చేసి ఇస్తే ఆలయానికి మరిన్ని గొడుగులు అందజేస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి హామీ ఇచ్చారు.